ఏప్రిల్ 2021
రు. 20/-

# చైతన్యం సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక

## CHAMPION
Of
LITERATURE & PUBLICATIONS

This Citation is proudly presented to

*Chaitanyam Sankalpabalam*

For achieving the World Record Title
"First Ever Video Magazine".

www.championsbookofworldrecords.com

CHAMPIONS BOOK OF WORLD RECORDS

DO SOMETHING
GREAT

చైతన్యం సంకల్ప బలం

2021

చైతన్యం సంకల్ప బలం

CHAITANYAM
SANKALPABALAM
Hyderabad, Telangana, India

ASIAN WORLD RECORDS

*Promoting Asian Talent Globally!*

FIRST EVER VIDEO MAGAZINE

Super Achiever-2021

ASIAN
WORLD
RECORDS

www.asiantalentpromotionforum.com



**TEEGAVARAPU SHANTI**

Hyderabad, Telangana, India

Promoting Asian Talent Globally!

First Woman Owner, Publisher & Editor of a Magazine

**Super Achiever-2021**

# ASIAN WORLD RECORDS

DO SOMETHING

**GREAT**

# CHAMPION

## Of

## LITERATURE & PUBLICATIONS

This Citation is proudly presented to

*Teegavarapu Shanti*

for her outstanding contribution in the field of Literature & Publication and for achieving the World Record title " The First Woman Owner, Publisher & Editor of a Magazine."

www.championsbookofworldrecords.com



2021



వ్యవస్థాపక సంపాదకురాలు
**తీగవరపు శాంతి**

# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి - 10  ఏప్రిల్ 2021  సంచిక - 7

## ఈ సంచికలో....

| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 6 |
| వైద్యో నారాయణో హరి: | 7 |
| ఉగాది ఎలా జరుపుకోను | 8 |
| కాలరచన | 9 |
| ప్రపంచ దివసం | 12 |
| వేదులాన్వయు పలుకు | 14 |
| పూరీ జగన్నాధస్వామి వైభవం | 15 |
| పంచాగ శ్రవణం | 17 |
| సప్త మోక్ష నగరాలు | 18 |
| 116 కందాల్లో సుందరకాండ | 22 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 25 |
| ప్రేమంటే ఇంతే | 28 |
| లసతు సంస్కృతం - జయతు భారతం | 32 |
| ప్లవ నామ సంవత్సరానికి ఆహ్వానం | 33 |
| అమృతం కన్న అమ్మపాలు మిన్న | 34 |
| నవవిధ భక్తులు | 35 |
| మా ఊరి నందుల కథ | 37 |
| కోవిడ్ వాక్సిన్,ఉగాదికి ఆహ్వానం ప్రార్ధన, మంగళం | 39 |
| శ్రీ వచన భూషణం | 40 |
| వైజ్ఞానిక పద బంధ కేళి | 43 |
| అసలు కవిత్వానికి ఆనవాలు ... | 44 |
| ఉగాది | 48 |
| ఉగాది పాట | 48 |
| కొత్త సంవత్సరంలో ఆర్థిక నిబంధనలు | 49 |
| సినిమా | 50 |

ఈ ఉగాది నుండి మన పత్రిక వీడియో సంచిక మొదలుపెడుతున్నాం. తెలుగు చదవ-లేని మన యువతకు, చిన్నారి బాలబాలికలకు, చదవగలిగినా చదవటానికి సమయం దొరకని వారికి, ఈ అందరినీ దృష్టిలో పెట్టుకుని వీడియో సంచిక మొదలుపెట్టడం జరిగింది. ఆదరిస్తారు కదూ!

రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## చైతన్యం సంకల్పబలం పత్రిక పాఠకులకు ప్లవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

### ఉగాది పండుగ ప్రాధాన్యత

చైత్ర శుద్ధ పాడ్యమి నాడు వచ్చే తెలుగు వారి మొదటి పండుగ ఉగాది. ఇది వసంత కాలంలో వస్తుంది. బ్రహ్మ దేవుడు గత ప్రళయం పూర్తి అయిన తరువాత తిరిగి సృష్టి ప్రారంభించే సమయాన్ని బ్రహ్మ కల్పం అంటారు. ఇలా ప్రతీ కల్పం లోను మొదట వచ్చే పండుగ 'యుగాది' అని యుగానికి ఆదిగా ప్రారంభ సమయంగా "ఉగాది" అని వ్యవహరిస్తూ ఉంటారు. ఈ పండుగ చైత్ర మాసంలో మొదలవుతుంది కనుక ఆ రోజు నుండి తెలుగు సంవత్సర మొదటి దినంగా పరిగణిస్తాం.

ఈ ఉగాది పండుగ రోజున అందరు తల స్నానాలు చేయడం, కొత్త బట్టలు ధరించడం, ఇంటి ముంగిట ముగ్గులు వేసి వసంత లక్ష్మికి స్వాగతం పలకడం చేస్తూ ఉంటారు. షడ్రుచులతో కూడిన ఉగాది ప్రసాదాన్ని పంచాంగానికి, దేవతలకు నైవేద్యం చేసి, తమ భవిష్యత్ జీవితాలు ఆనందంగా సాగాలని కోరుకుంటూ ఉగాది పచ్చడి తింటారు. ఈ పచ్చడి వైద్య పరంగా కూడా వ్యాధి నిరోధక శక్తిని కలిగిస్తుందని అంటారు.

ఇక ఉదయం వేళ లేదా సాయంత్రం వేళ పంచాంగ శ్రవణం చేస్తారు. ఉగాది పండుగ రోజున అందరూ కలిసి పండితులను ఆహ్వానించి, వారిని సన్మానించి, పంచాంగ శ్రవణం చేయడం కూడా జరుగుతుంది. సంవత్సరం లోని శుభ అశుభాలను తెలుసుకుని దానికి అనుగుణంగా వారి భావి జీవితాన్ని ఆచరించేం దుకు మొదలు పెడతారు. ఈ పంచాంగ శ్రవణం వలన మానవునికి సంపద ఆయుష్షు, పాప ప్రక్షాళన, వ్యాధి నివారణ, గంగా స్నాన పుణ్య ఫలం వస్తాయని విశ్వసిస్తారు.

### సర్వోన్నత పీఠం పై తెలుగు తేజం

తెలుగు జాతి ఖ్యాతిని చాటుతూ 48 వ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా శ్రీ ఎం. వి. రమణ ఈ నెల 24 వ తేదీన పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. 2022 ఆగస్టు 26 వరకూ సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి గా కొనసాగుతారు. 4 దశాబ్దాల అనంతరం మరల తెలుగు తేజం ప్రధాన న్యాయ మూర్తిగా బాధ్యతలు స్వీకరించడం నందిగామ బార్ అసోసియేషన్ సభ్యులు అందరూ ఆనందం వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లా ఆవరణలో సంబరాలు జరుపుకున్నారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో అభ్యసించిన అయన తోటి స్నేహి తులు ఎంతో హర్షం వ్యక్తం చేశారు.

### యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి

దేశంలోని ఆలయాలకు ఆదర్శంగా యాదాద్రి యాదగిరి గుట్టలోని "లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఎంతో అందంగా రూపుదిద్దుకుంది. మే నెలలో తిరిగి పునః ప్రారంభించే అవకాశం ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.

### మంజీరా లోని గోదార్ఝురి

హల్దీ కాలువకు కొండ పోచమ్మ నీటిని విడుదల చేసిన కేసీఆర్.

మన తెలంగాణా గద్వేల్ - కాళేశ్వరం నీటితో నిండిన కొండపోచమ్మ రిజర్వాయరు నుండి గోదావరి జలాలు హల్దీ కాలువలోకి విడుదలతో, మరో చారిత్రాత్మక ఘట్టం మంగళవారం ముఖ్య మంత్రి చేతుల

మీదుగా ఆవిష్కృతమైంది. దీనితో గోదావరి జలాలు మంజీరా నది లోకి పరుగులు పెట్టాయి. ఈ ప్రక్రియతో తెలంగాణాను కోటి ఎకరాల మాగాణి గా అభివృద్ధి చేయాలనే తలంపుతో సాగునీటి ప్రాజెక్ట్ రూపకల్పన సీఎం.కేసీఆర్ కార్యాచరణ కీలకమైన మైలురాయి దాటింది. ఈ హల్దీ కాల్వలో-కి 1600ల క్యూసెక్కుల నీటిని విడుదల విడుదల చేయగా 5 నుంచి 10 రోజులలో ఈ వాగు నుండి మంజీరా నది ద్వారా నిజాం సాగర్ కు తరలించే కార్య క్రమానికి సియం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. తదనంతరం కొండ పోచమ్మ సాగర్ జలాలను గజ్వేల్ కెనాల్ నుండి సిద్ధిపేట జిల్లాలోని 20 చెరువు-లను నింపేందుకు వదిలారు.

### టాప్ 20 లో అవార్డులు

టాప్ 20 లో "గ్లోబల్ ఉమెన్ ఆఫ్ ఎక్సలెన్స్" అవార్డుకు తెలంగాణా గవర్నర్ తమిళ్ ఇసై సౌందర్య రాజన్ ఎన్నికయ్యారు. అలాగే టాప్ 20 లో నే "గ్లోబల్ వుమెన్ ఆఫ్ ఎక్సలెన్స్" అవార్డుకు అమెరికా ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ కూడా ఎన్నికవ్వడం విశేషం, హర్షదాయకం. వారితో పాటుగా మరో 18 మంది ఈ అవార్డుకు ఎంపిక అయ్యారు.

### దేశీయ వార్తలు - కరోనా ఉధృతి

భారత దేశంలో కరోనా ఉధృతంగా ఉంది. ఒక్క రోజులోనే లక్ష కేసులు దాటితే ముందు ముందు ఎలా ఉంటుంది అని మనం ఆలోచించుకోవాలి. మనకి ఉన్న జనాభాకి ఉన్న ఇన్ఫరా-స్ట్రక్చర్ ఎంత? అందరూ కరోనా తగ్గిపోయింది అని మాస్కులు లేకుండా కూడా లేకుండా తిరగడం మొదలు పెట్టారు. కరోనా నిబం- ధనలు పాటించకుండా పార్టీలు అనీ, పెళ్లిళ్లు అనీ నిర్లక్ష్యంగా గుంపులుగుంపులుగా తిరగడం వల్లనే కరోనా మరల విజృంభించింది అని డాక్టర్లు చెబుతున్నారు.

ఏప్రిల్ రెండో వారం వచ్చేసరికి పీక్ స్టేజ్ కి చేరుకుంటాం అంటున్నారు. మనం చేస్తున్నదేమిటి? బయట చూస్తే కరోనా ఉన్నట్టే కనిపించదు. స్టాటిస్టిక్స్ చూ స్తే లక్ష దాటింది. మనకి ఉన్న హెల్త్ ఇం-ఫ్రాఆస్టక్చర్ ఎంత ? సామాజిక దూరం పాటించరు ఒక వాక్సినేషన్ తీసుకోగానే, మాస్కులు దింపేసి బయటకి తిరుగుతున్నారు. రోడ్ల మీదే ఉంటున్నారు. మార్చిలో 14, 15 తేదీల్లో చూస్తే ఇప్పుడున్న వాటిలో 10 శాతం కేసులు కూడా లేవు. అంటే 10 రోజుల్లోపల 10 రెట్లు పెరిగాయి హాస్పిటల్స్ నిండి పోయాయి. ఇన్ఫ్రా స్ట్రక్చర్ కొలాప్స్ అయిపోతుంది.

శార్వరీ నామ సంవత్సరంలో అంటే 14 నెలలుగా ప్రజలు పడుతున్న కష్టాలు, బాధలు అందరికీ తొలగి పోయి, ఈ ప్లవ నామ సంవత్సరంలో (ప్లవ అంటే తెప్ప అని అర్థం) ప్రతీ ఒక్కరు ఎవరి జాగ్ర త్తలో వారు ఉంటూ అందరూ సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుకుంటోంది చైతన్యం సంకల్పబలం. సర్వేజనా సుఖినోభవంతు

ఉగాది శుభాకాంక్షలతో,
మీ ఎడిటర్,

తీగవరపు శాంతి

# అభిప్రాయవేదిక


1. మహిళాశక్తి గురించి ఎడిటోరియల్ బాగా వ్రాశారు. వైద్యోనారాయణో హరి: అనే శీర్షిక చాలా బావుంటోంది. ఎంతో ఉపయోగకరమైన సమాచారాన్ని అందిస్తున్న ఆ డాక్టర్లకు ధన్యవాదాలు తెలపండి. హగ్ బాస్ హంగామా భువనచంద్ర గారు వ్రాసిన కథ చదువుతున్నంత సేపూ నవ్వాగలేదు. వారు ఏది వ్రాసినా చాలా బావుంటుంది.
శ్రీ చంద్ర శేఖర్ , శ్రీమతి వనజ --- ఏలూరు. శ్రీ శ్రీరామ్, శ్రీమతి సుజల --- కర్నూలు. శ్రీమతి మణి,
2. దశమగ్రహం కాదు శ్రీ ఎలక్ట్రాన్ గారు వ్రాసిన కథ కుచేలుడి పిల్లలతో పోలుస్తూ, కుటుంబ నియంత్రణని సూచిస్తూ, పిల్లల బాధ్యతలు ఎలా తీర్చారు? వంటి అనేక విషయాలతో కథ చాలా బావుంది. ప్రజలను చైతన్య పరుస్తూ వేదుల సుబ్రహ్మణ్యం గారు వ్రాస్తున్న వేదులాన్వయ పలుకు పద్యాలు చాలా బావుంటున్నాయి.
శ్రీ రామచంద్రరావు, శ్రీ మోహనరావు --- కాకినాడ. శ్రీమతి సుజాత, శ్రీరమణ్ ---- వేములవాడ. శ్రీమతి భారతి, శ్రీమతి సుమ ---- ఏలూరు. శ్రీమతి శ్రీలత, శ్రీమతి శిరీష, శ్రీ కృష్ణ ----- పిఠాపురం.
3. పూరీ జగన్నాథ వైభవం గురించి పోచినపెద్ది మురళీ కృష్ణ గారు చాలా బాగా వ్రాస్తున్నారు. విగ్రహ ప్రతిష్టకి బ్రహ్మ రావడంతో సహా అన్నీ కళ్ళకి కట్టినట్లు వ్రాస్తున్నారు. సప్త మోక్ష నగరాలు లో మాయ ( నేటి హరిద్వార్) అంటూ హృషీకేశ్ దర్శనం, ఆధ్యాత్మిక చింతన, విదేశీయులు యోగా నేర్చుకోవడంతో సహా అనేక విషయాలు చక్కగా తెలియ జేశారు.
శ్రీ సుబ్రహమణ్యం, శ్రీమతి లక్ష్మి --- తణుకు. శ్రీ కరుణాకర్, శ్రీమతి నిర్మల ---- బొంబాయి. శ్రీమతి కనక. శ్రీ సుధాకర్, శ్రీమతి పావని ---- తణుకు. శ్రీమతి సుందరి, శ్రీ సురేష్ --- రాజమండ్రి.
4.పరిపూర్ణ స్త్రీ లో అందరూ ఉన్నారు. ఖండాంతరాల్లో భారత దేశ ఖ్యాతిని విస్తరింపజేసిన స్వామీ వివేకానందునికి దిశా నిర్దేశం చేసింది ఆయన తల్లే. ఇలా ఎందరో స్త్రీ మూర్తులున్నారు అంటూ స్త్రీ గొప్ప తనం గురించి పోడూరి గారు చాల బాగా వ్రాసారు.
నూట పదహారు కందాల్లో సుందర కాండ అంటూ పాలెపు బుచ్చిరాజు గారు పద్యంతో పాటు తాత్పర్యం కూడా చక్కగా వివరిస్తున్నారు.
శ్రీమతి సరోజ, శ్రీ బాబురావు , శ్రీమతి కల్పన --- పూనా. శ్రీ కనకారావు, శ్రీ సుబ్రహ్మణ్యం , శ్రీమతి పల్లవి ----- ఆస్ట్రేలియా. శ్రీమతి శుభ , శ్రీ అరుణ్ ---సికింద్రాబాద్.
5. వేమూరి గారు వ్రాస్తున్న కథల్లో ఈ నెల వ్రాసిన ట్రాయ్ మహా సంగ్రామం కథలో ఒక వివాహ సందర్భంలో చేసిన విందులో జూస్ ఏరిస్ ని విందుకు పిలవక పోవడంతో ఆత్మాభిమానం దెబ్బ తిన్న ఏరిస్ బంతి భోజనాల మధ్యకి బంగారు యాపిల్ పండుని విసిరి వెళ్ళిపోతుంది అంటూ అద్భుతంగా వ్రాసారు. ప్రతీ నెల అంత అద్భుతంగా వ్రాస్తున్నారు. ప్రేమంటే ఇంతే లో ఇంద్రగంటి వెంకట సుబ్బారావు గారు వ్రాస్తున్న సీరియల్ సస్పెన్స్ తో బాగా వ్రాస్తున్నారు. లావణ్యాన్ని పెళ్లి కూతురుని చెయ్యడం, అందరూ సరదాగా కబుర్లు చెప్పుకోవడం లాంటి కథ అందిస్తూ మమ్మల్ని అందరినీ పెళ్లి వారిని చేశారు.
శ్రీమతి అనసూయ , శ్రీమతి రుక్మిణి, శ్రీ సుధాకర్ --- ఖమ్మం. శ్రీ కిరణ్ , శ్రీ వంశీ, శ్రీమతి గీత ---- రాయపూర్. శ్రీమతి కమల, శ్రీ సుబ్బారావు, శ్రీమతి అపర్ణ --- తాడేపల్లి గూడెం.
6. సనాతన (హైందవ) ధర్మంలో మహిళ అంటూ మహిళ గురించి మనుస్మృతి లో ఇలా చెప్పారంటూ, అలాగే పోతన భాగవతం లోని పద్యాలను ఆధారంగా చేసుకుని స్త్రీ మూర్తి గౌరవాన్ని పెంచే విధంగా వ్రాసారు హరగోపాల్ గారు.
ఆదూరి హైమవతి గారు నవ విధ భక్తులు గురించి వ్రాస్తూ, ఈ నెల పాద సేవనం గురించి బాగా వ్రాసారు. లక్ష్మీ దేవి నారాయణుని పాద సేవ, తల్లీ గురువులకూ పాద సేవ చేయడం బాగా వ్రాసారు.
శ్రీమతి సుందరి, శ్రీ మధు, శ్రీ ప్రకాష్ ---- కడప. శ్రీమతి మాధవి, శ్రీ లక్ష్మి, శ్రీమతి రేణుక --- కాకినాడ. శ్రీ వెంకటేశ్వర రావు, శ్రీ వేణు గోపాలరావు, శ్రీమతి ప్రభ ---- ఓడలరేవు.
7. మా ఊరి నందుల కథ ఎంతో ఆత్మీయంగా వ్రాస్తున్నారు నందుల ప్రభాకరశా'స్త్రి గారు. రాజకీయ నాయకులు అంటూ వ్రాస్తూ 'పలుగురాళ్ళ పల్లె' రాజకీయాలు గురించి వ్రాస్తూ ఆ ఊరు తీసుకుని వెళ్లారు మమ్మల్ని. పల్లె వాతావరణంలో కూడా ఎలా ఉంటాయో బాగా వ్రాసారు. భాగవతులతో అను బంధం గురించి వేంకటాచార్యులు గారు బాగా వ్రాస్తున్నారు. రాక్షస రూపంలో ఉన్న రామ శర్మ అజ్ఞానం తొలగడం, అలాగే పూర్వ జన్మ స్మృతి వీటి గురించి బాగా వ్రాసారు.
శ్రీ ప్రకాశరావు, శ్రీమతి విజయ, శ్రీ సుందరేశ్వర రావు. శ్రీమతి కనక దుర్గ ----- రావులపాలెం. శ్రీ రంగారావు, శ్రీ వెంకట్రావు , శ్రీమతి సుమతి ---- ఏలూరు .
8. చాగంటి కృష్ణ కుమారి గారు గడి --- నుడి ప్రతీ నెల ఎంతో విజ్ఞానదాయకంగా ఇస్తున్నారు. చాలా శ్రద్ధగా చేస్తూ ఉంటాము. బుఱ్ఱకి పదును పెట్టేదిగా ఉంటోంది. పద మూడేళ్ళ వయస్సులోనే ఎవరెస్టు ను అధిరోహించిన పూర్ణ మాలావత్ గురించి వ్రాస్తూ పదమూడేళ్ల వయస్సు లోనే ఎవరెస్టు శిఖరాన్ని ఎలా అధిరోహించిందో అన్నిటినీ చాలా బాగా వివరించి వ్రాసారు.
శ్రీమతి శ్రీలక్ష్మి, శ్రీ హర్షిణి , శ్రీమతి వేదవతి, శ్రీ మధు ---- చంద్రాపూర్. శ్రీమతి అను, శ్రీ చక్రధర రావు, శ్రీమతి మాలతి --- హైదరాబాదు.
9. ఆడవాళ్లు అందంగా ఉంటే అద్భుతాలే అంటూ స్త్రీలు మానసికంగా ఉత్సాహాన్ని పెంచుకుందుకు ఎవరికి ఎందులో ఆనందం కలుగుతుందో అందులో ఆనందాన్ని అనుభవిస్తూ, మానసిక వత్తిడిని తగ్గించుకుందుకు ప్రయత్నించాలి. దాని వల్ల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చు. అంటూ చక్కటి సూచనలతో భారతి గారు బాగా వ్రాసారు. అందమైన కవర్ పేజీలతో చాలా మంచి పత్రికను తీసుకు వస్తున్నారు.
శ్రీ పల్లం రాజు,శ్రీమతి అరుణ --- రామగుండం. శ్రీమతి సుగుణ, శ్రీ మూర్తి, శ్రీమతి అనిత --- కిర్లంపూడి. శ్రీ కోటేశ్వరావు, శ్రీ ప్రభాకరరావు, శ్రీమతి సుబ్బలక్ష్మి ---- ఖాజీపేట.

# వైద్యో నారాయణో హరి:



'Brain'- మెదడు బహుశా ఈ ప్రపంచంలోనే అత్యంత కాంప్లెక్స్/కీలకమైన వ్యవస్థ (System) అంటే అతిశయోక్తి కాదేమో! మన మెదడులో సుమారు 100 బిలియన్ (ఒక బిలియన్ అంటే 100 కోట్లు) కణాలు (Neurons) నిండి ఉంటాయి. ఇవి ఇతర వేల కొద్దీ neurons తో Synapses ద్వారా కనెక్ట్ అయిఉంటాయి. ఈ Neurons ఒకటితో ఒకటి ఎలక్ట్రిక్ సిగ్నల్స్ ద్వారా మాట్లాడుకుంటూ ఉంటాయి. మన మాట, ఆలోచన, ఊహ, శ్వాస, చూపు, జ్ఞాపకంతో పాటు అన్ని అవయవాలను నియంత్రించేది మన మెదడు.

మన మెదడులో Cerebrum, Cerebellum మరియు Brain Stem అనే మూడు ముఖ్యమైన భాగాలు మన శరీరంలో జరిగే అనేక రకాల ఫంక్షన్స్ కు కారణం. Neuroscience, Brain మరియు నెర్వస్ సిస్టమ్ పైన ఎన్నో దశాబ్దాల నుండి పరిశోధనలు జరుగుతున్నా కూడా, ఇతర అవయవాలలో పోలిస్తే పూర్తిగా వీటి అంతు చిక్కలేదు అంటే ఆశ్చర్యం కలగొచ్చు. అందుకే ఇప్పటికీ Brain ను ఒక Mysterious Organ గానే అనుకోవాలి.




అటువంటి Brain and Nervous System గురించి మాట్లాడటానికి మన ముందుకు వచ్చారు Neuro Vascular అండ్ క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డా. చేతన్ వేంకట సుబ్బారావు గారు. ఆయన Bangalore మెడికల్ కాలేజీ లో మెడికల్ డిగ్రీ పూర్తి చేసుకున్న తర్వాత, అమెరికా లోని డెట్రాయిట్ లో రెసిడెన్సీ మరియు Neurology అండ్ Neurovasculaar లో ఫెలోషిప్ చేశారు. ఇప్పుడు Baylor కాలేజ్ ఆఫ్ మెడిసిన్ లో ప్రోగ్రామ్ డైరక్టర్ ఆఫ్ న్యూరాలజీ / న్యూరో క్రిటికల్ కేర్ ఫెలోషిప్ మరియు డైరెక్టర్ ఆఫ్ న్యూరో క్రిటికల్ కేర్ యూనిట్ at BSLMC and Section Head అఫ్ Neurovascular /Neuroscience and Neurocritical care గా పనిచేస్తున్నారు. Neurovascular / Neuroscience ఫీల్డ్ కో ఎంతో పరిశోధన చేసి అనేక రకాల Research పేపర్స్ పబ్లిష్ చేశారు.

# ఉగాది
# ఎలా జరుపుకోను?



పోడూరి శ్రీనివాసరావు

ఆ దేశమనీ లేదు ...... ఈ దేశమనీ లేదు
ప్రపంచమంతా కరోనా భయం
గుప్పెట్లో గజగజా వణుకుతోంది
ఇక ఉగాది ఊసెక్కడుంది?

చైనాలోని యూహాన్ లో పుట్టిందన్నారు
వయసుతో సంబంధం లేకుండా.
వీసా, పాస్ పోర్టులతో పనిలేకుండా
దేశాలన్నీ ఆక్రమించింది, విశ్వవిజేత అలెగ్జాన్ డర్ లా

అమెరికా, ఇంగ్లాండు, జర్మనీ, బ్రెజిల్....
ఒక దేశమని కాదు, ఒక ప్రాంతమని కాదు....
భారత్ తో సహా పలు దేశాల్లో
విజయకేతనం. ఎగరేసింది కరోనా మహమ్మారి

శవాల గుట్టలతో నిండిపోయిన
అగ్రరాజ్యాల వీధులు. భయంతో అట్టుడికిపోయాయి
పారిశుధ్యానికి భయపడిన. దేశాలు కకావికలు
అయ్యాయి .... ఇక ఉగాది. మాటేమిటి?

ధైర్యంతో. ముందడుగు. వేసింది. భారత్
పరిశోధనల పరంపర కొనసాగించింది
లాక్ డౌన్ ప్రక్రియతో జాగ్రత్తలు పాటిస్తూ
కోవాక్జిన్, కోవి షీల్డ్ లను ఆవిష్కరించింది

భారత్ బయోటెక్ ఆధ్వర్యంలో
సమర్థవంతంగా వాక్సినేషన్ కనుగొంది
విజృంభిస్తున్న కరోనా .... తోకముడిచి
పలాయన మంత్రం. పఠించింది

సమర్థవంతంగా సమృద్ధిగా తయారీయే కాదు
ఒక్క. భారత్ కే కాదు .. ప్రపంచ దేశాలకు
సైతం వాక్సిన్ సరఫరా చేసే స్థితికి చేరింది భారత్
విశ్వం వేనోళ్ళ. పొగిడింది భారతదేశ ప్రతిభను

రక్షణ కవచం - మాస్క్ లను ధరించండి
సామాజిక దూరం పాటించండి
గుంపులు గుంపులుగా చేరకండి
కరచాలనం వద్దండి - నమస్కారమే మన
సంస్కారం

మొదటి డోసు వాక్సిన్ వేసుకోండి
మరో 28 రోజులకు రెండో డోసండి
కరోనా... కోవిడ్ ... మీ దరిదాపులకు రావండి
ఆనందమయ జీవితాన్ని ఆహ్లాదంగా జరుపుకోండి

కరోనా రహిత, ఆనంద భరిత
జీవితానికి ఆహ్వానం. పలకండి
హాయిగా, ఆనందంగా గడుపుకోండి
ఇక 'ఉగాది' ని వేడుకగా

భయభ్రాంతులను పారద్రోలుతూ
ఉగాది పండుగను జరుపుకుందాం
నవ్య ఉగాది..... భవ్య ఉగాది ..
మన తెలుగువారి విజయానికి పునాది. ...

# కాల రచన



భువనచంద్ర

"కాలం అంటే కేవలం నది లాగా ప్రవహించేది మాత్రమే కాదు... ఎప్పుడు ఏమేమి ఎలా జరగాలో స్పష్టంగా రచించేది. శృతినీ, గతినీ నిర్ణయించేది" అన్నారు మా స్వామీజీ ఓనాడు. చింతలపూడి అనే మా వూళ్ళో విశ్వనాధాశ్రమాన్ని స్థాపించింది వారే. ఆది శంకరాచార్యులవారి విగ్రహాన్నీ, శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారి విగ్రహాన్నీ ప్రతిష్ఠించి ప్రాణ ప్రతిష్ఠ చేసిందీ వారే. వారి పేరు శ్రీ బోధానందపురి మహారాజ్.

"ఎలా స్వామీజీ?" అడిగారొక భక్తుడు. దసరా ఉత్సవాలు మా ఆశ్రమంలో అద్భుతంగా జరుగుతాయి. వేలాదిమంది భక్తులు వచ్చి అమ్మవార్ని దర్శించుకునేవారు. ఎందరో పండితులు, భాగవతార్లూ, హరికథా విడవాసులు వచ్చి ఆ పదకొండు రోజులూ అద్భుతంగా తమ ప్రజ్ఞతో ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసేవారు.

"నిన్న మీరు భరతుడి పుట్టుక గురించి విన్నారుగా. భరతుడి పుట్టుక జరగాలంటే మొదట అతని తల్లిదండ్రులే కాదు అమ్మమ్మ తాతయ్యలు ఎవరో కూడా నిర్ణయించబడాలి. ఒక నాటకాన్ని రక్తి కట్టించాలంటే సరైన రచయితలే కాదు, సరైన పాత్రధారులుండాలి. అప్పుడే ఆ నాటకం ప్రజారంజకమవుతుంది. మనిషి రాసే నాటకమే ఇంత రక్తి కడితే, కాలం రచించే నాటకం ఇంకెంత పకడ్బందీగా ఉండాలీ?" నవ్వారు స్వామీజీ.



"మీరు వివరించి చెబితేనే గదా మాకూ అర్థం అయ్యేది. మేమేదో చదివినదానికి కొంత కల్పనా జోడించి ప్రేక్షకులు ఆనందించేలా చెబుతామే గానీ, అంతరార్థాలూ, విశేషార్థాలూ మాకేం తెలుసూ!" గడుసుగా అన్నారు ఇంగువ వాసుదేవశాస్త్రి గారు. ఆయన గొప్ప విద్వత్తు గలిగినవాడే. అందులో ఏమాత్రం సందేహం లేదు. అయినా, స్వామీజీ ముందు పిల్లాడయిపోతాడు.

"అయ్యా శాస్త్రిగారూ... మీకు తెలిసిన విషయాన్నే మళ్ళీ నాతో చెప్పించుకోవడం మీ వినయానికి నిదర్శనం. సరే. అఖండ భరత ఖండాన్ని పరిపాలించడానికి ఓ రాజుని కాలం సృష్టించాలి. ఆ రాజు లక్షణాలు ఏమై వుండాలీ? ఒకటి నిర్భయత్వం. రెండు బుద్ధి బలం. మూడు అనంతమైన శారీరక బలం. నాలుగు దేన్నైనా లొంగదీసుకు తీరాలనే పట్టుదల. అయిదు రక్షించగల సామర్థ్యం. ఆరు ధర్మాధర్మ విచక్షణ. ఏడు పెద్దవారి మాటల్ని ఆలకించే వినయ విధేయతలు. ఎనిమిది అవసరమైనప్పుడు నిర్దాక్షిణ్యంగా వ్యవహరించగల నిర్మోహమాటం, నిర్దయ. ఇన్ని లక్షణాలు భరతుడిలో పుష్కలంగా వున్నాయి. ఈ లక్షణాలు అతనికి సంక్రమించాలంటే, ఇవన్నీనో, కొన్నో తల్లిదండ్రులనుంచి రావాలి. ఆ తల్లిదండ్రులకి కూడా ఈ లక్షణాలు వారికి


పూర్వీకులనుంచి రావాలి. అంటే వారి తరతరాల చరిత్రనూ పరిశీలించాల్సి ఉంటుంది. సైన్సు ప్రకారం 'జీన్' స్ట్రక్చర్ మారాలంటే 28 మిలియన్ సంవత్సరాలు పడుతుంది. ఒక మిలియన్ అంటే పది లక్షలు. 28 మిలియన్ అంటే 28 x 10 = 280 లక్షల సంవత్సరాలు. అంటే, ఎన్ని మహాయుగాలు గడవాలీ?" ఆగారు స్వామీజీ.

"మహాయుగం అంటే?" అడిగాడు మా మొక్కపాటి రవి.

"కృత, త్రేతా, ద్వాపర, కలి యుగాలు నాలుగిటినీ కలిపితే ఒక మహాయుగం అవుతుంది. లెక్కలు తరువాత చెబుతానులే. ఈ భూమండలంలో గణితాన్ని నేర్పిందీ, నేర్పిందీ భారతీయులే. అంతే కాదు. వాస్తు, జ్యోతిష్య, అణు (కణ), వైద్య, ఖగోళ శాస్త్రాల్ని కూడా స్పష్టంగా లోకానికి ఇచ్చింది భారతీయులే!" స్వామీజీ మోహంలో ఆనందంతో కూడిన చిరునవ్వు.

"అబ్బాయ్ రవీ... చిన్న చిన్న ప్రశ్నలతో అడ్డం రాకు. స్వామీజీని చెప్పనీ" మందలించారు సబ్ రిజిస్ట్రార్.

పకపకా నవ్వారు స్వామీజీ. "అయ్యా సబ్ రిజిస్ట్రారు గారూ ఇవన్నీ నేను చెబుతున్నది పిల్లలకోసమే! సగం జీవితం గడిపేసినవాళ్ళకి ఇదంతా ఎందుకూ? అబ్బాయ్, కలియుగ పరిమితి 4,32,000 సంవత్సరాలు. దాని పైనున్నది ద్వాపరయుగం. దాని పరిమితి 8,64,000 సంవత్సరాలు. త్రేతాయుగపు పరిమితి 12,96,000 సంవత్సరాలు. ఆ పైది కృతయుగం. దాని కాలపరిమితి 17,28,000 సంవత్సరాలు. ఈ నాలుగూ కలిపితే ఒక



మహాయుగం. అంటే 43 లక్షల 20 వేల సంవత్సరాలన్న మాట. ఇలాంటివి 71 మహాయుగాలు గడిస్తే ఒక మన్వంతరం అవుతుంది. నాయనా, భారతీయుల కాలమానం అత్యంత అద్భుతమైనది. దీనికి సాటి వచ్చేది సృష్టి లోనే లేదు" రవి గాడి సందేహం తీర్చారు స్వామీజీ.

"మీరు భరతుడి సంగతి చెబుతున్నారు" గుర్తు చేసింది మహాలక్ష్మమ్మ వినయంగా.

"అవును కదూ..! దుశ్యంతుడు అందగాడు. అమ్మాయిల్ని క్షణాల్లో వాలా వేయగల సౌందర్యం కలవాడు. అలాగే అవసరం తీరాక అవతలకి త్రోసే దుర్గుణం కూడా అతనిలో వుంది. ఒకవిధంగా చెప్పాలంటే, శౌర్యమూ, క్రూరత్వమూ, సౌందర్యమూ కూడా సమపాళ్లలో కలిగినవాడు, పులులు సింహాలు వంటి క్రూర జంతువుల్ని వేటాడి పట్టుకుని, వాటితో ఆటలాడుకునే అలవాటు అతనికి చిన్నతనం నుంచే వుంది.

ఇక శకుంతల.... ఈమె మేనక, విశ్వామిత్రుల సంగమం వల్ల పుట్టిన బిడ్డ. మేనక అత్యంత సౌందర్యవంతురాలే కాక అద్భుతమైన మేధస్సు, సహజమైన ప్రతిభ కలిగిన దేవకన్య. రంభ ఊర్వశి తిలోత్తమలతో సరితూగే నాట్య ప్రతిభ యీమె సొత్తు.

ఇక భరతుడి తాత అయిన విశ్వామిత్రుడైతే, బ్రహ్మ కుమారుడైన కుశుడికి మునిమనవడు. ఎలాగంటే, కుశుని కొడుకు కుశనాభుడు,కుశనాభుడి కొడుకు గాడి. ఆ గాది యొక్క పుత్రుడే విశ్వామిత్రుడు. కుశ వంశం వాడు కనక ఇతడ్ని కౌశికుడు అని కూడా పిలుస్తారు. అనన్య సామాన్యమైన పట్టుదల, పంతం, దీక్ష


విశ్వామిత్రుడికి పుట్టుకతో వచ్చిన లక్షణాలు. అనుకున్నది సాధించేవరకూ నిద్రపోని మనస్తత్వం. ఎంత చాపల్యం వుందో అంతకి వెయ్యిరెట్లు పట్టుదల వుంది. క్షాత్ర ధర్మాన్నించి బ్రాహ్మణత్వానికి మారే ప్రయత్నంలోనే మేనకా సౌందర్యానికి ముగ్ధుడై శకుంతల జన్మకి కారకుడయ్యాడు.

విశ్వామిత్రునిలో గల పట్టుదల, దీక్ష, మేనకలోని ప్రతిభ, మేధస్సు, సౌజన్యం, సున్నితత్వం, శకుంతలలోని సౌకుమార్యం ధీరత్వం+ దుష్యంతునిలోని సౌందర్యమూ, క్రూరత్వము (ఇక్కడ క్రూరత్వము అంటే తాను చేసే పనులలో లేక కర్తవ్యంలో నిర్దాక్షిణ్యంగా తీసుకోవాలి). ఇవన్నీ కలగలిపితే కానీ భరతుడు అనే మహా బలశాలియైన చక్రవర్తి ప్రభవించలేదు. అంటే, భరతుడి పుట్టుకకి వ్యూహరచన చేసింది కాలమే గదా! లేకపోతే ఎక్కడి మేనక, ఎక్కడి విశ్వామిత్రుడు, ఎక్కడి శాకుంతల, ఎక్కడి దుష్యంతుడు.... ఎక్కడి కణ్వుడు. ఒక భరతుడు ఓ ఖండాన్నే నిర్మించడానికి ఇంతమంది ప్రత్యక్ష, పరోక్ష కారకులయ్యారు" ఆగారు స్వామీజీ.

"అంటే ప్రతి పుట్టుకకీ ఇలాంటి కారణాలు ఉంటాయా స్వామీజీ?" అడిగాడో భక్తుడు.

"అవును. కాలానికి సంబంధించిన రహస్యాలు మనకి అర్థం కావు. అది మన మేధో శక్తికి అతీతతమైనది. జాగ్రత్తగా గమనిస్తే ప్రతి వ్యక్తి పుట్టుక వెనకా ఓ సృష్టి రహస్యం ఇమిడేవుంటుంది" చెప్పారు స్వామీజీ.

"ఎక్కడో పోర్ బందర్ లో పుట్టిన గాంధీ ప్రపంచానికి అహింస అనే అద్భుతమైన ఆయుధాన్ని-



చ్చి శాంతిని స్థాపింపచెయ్యలేదా? అంతెందుకూ... అగ్గిపుల్ల దగ్గర్నుంచి అణ్వస్త్రాల వరకూ కనిపెట్టిన మహానుభావులందరూ మానవాళి ప్రగతికి చేసిన శ్రమనూ త్యాగాలనీ మనం మర్చిపోగలమా? ఆర్థిక సాంఘిక, సాంకేతిక, విద్యా, వైద్య, రవాణా, ప్రయాణ రంగాల్లో మానవుడు సాధించిన ప్రగతికి కారకులందరూ మనకోసం కాలం సృష్టించిన పుణ్యపురుషులు కాలరా?" మళ్ళీ ఆగారు స్వామీజీ.

మనం ప్రగతి అనుకునే ఈ మార్పులవల్ల నష్టమే లేదంటారా?" అడిగాడు అచ్చిరెడ్డి సుబ్బారావు.

"చెట్టుకి పూసిన ప్రతి పువ్వూ కాయగా మారాదు. ఒకవేళ కాయిగా మారితే ఆ బరువుకి చెట్టే నేలరాలిపోతుంది. సైన్సు తెచ్చే ప్రతిదీ మానవాళికి ఉపయోగపడనక్కరలేదు. కానీ ప్రతి ప్రయోగము, ప్రతి నిర్వచనము కూడా ప్రగతికి ఏదోనాడు మెట్లుగా మారతాయి. ఆ నమ్మకం నాకుంది. ఎందుకంటే నా దృష్టిలో ఇండియన్ ఫిలాసఫీ అంటే ప్యూరెస్ట్ ఫామ్ ఆఫ్ సైన్స్" అని ముగించారు స్వామీజీ.

**********

అయ్యా ప్రతి పుట్టుకకీ ఓ అర్థం వుంది. అందుకే ఎప్పుడూ నిరాశకీ నిస్పృహకీ లోను కాకూడదు. గెలుపోటములు కావు..... జీవితపు విలువని నిర్ణయించేది. మనలో వున్నా మంచి చెడులే మన జీవితాన్ని నిర్వచిస్తాయి.

సమస్త లోకాస్సుఖినో భవంతు.

మళ్ళీ కలుద్దాం.

మీ

భవనచంద్ర

# ప్రపంచ దివసం



## ఎలెక్ట్రాన్

ఎండిన మొక్కలతో, వ్యాపించిన ముళ్ల పొదలతో, చెట్ల నీడలు లేక, పురపాలక సంఘపు నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉన్న ఆ పట్టణ ఉద్యానవనంలో, బీటలువారిన సిమెంటు బెంచీలమీద కూర్చున్న ఆ ముగ్గురు స్నేహితులతో ప్రతిదిన సాయంకాలపు సమావేశం జరుగుతోంది.

"ఈ ప్రపంచ దివసాలు లేదా దినాలు దరిదాపుల్లో 180 కి పైగానే ఉన్నాయట. చాలా సామాజిక అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ దినాలు నిర్ధారింపబడతాయట" అన్నాడు నాగేశం.

సమాచార, గణాంక సేకరణలు నాగేశానికి కాలక్షేపం. ఆ ముగ్గురూ పదవీ విరమణ చేసి ఇరవై సంవత్సరాలు దాటి ఎనభైలలో పడినా ఈనాటి సమాజ ధోరణులగురించి ముచ్చట్లాడుకొంటారు.

"కావొచ్చు. కానీ అవన్నీ సామాజిక దృష్టితో సృష్టించబడినా వాటిలో కొంత శాతం అంతర్లీనంగా దేశీయమైన సంస్కృతీ సంప్రదాయాల్ని వెక్కిరించే ధోరణి ఉంటుంది. అవి సెలవుల్లేని పండగదినాలుగా, ఆదర్శాలు వల్లించే సభా, సమావేశ దినాలుగా ఉంటున్నాయి." అన్నాడు సీతాపతి.

"ప్రపంచ బాలల, యువత, ప్రేమికుల భర్తల, తల్లుల మహిళల, వయోధికుల, గుండె-సంబధిత, నవ్వుల, మధుమేహ, క్షయ, ఎయిడ్స్, కాన్సర్, పొగాకు, ధూమపాన నిషిద్ధ, వైద్యుల, వనాల, వన్యమృగాల, పర్యావరణ యిటీవలే ప్రవేశపెట్టబడిన యోగా........ఇలా ఒకటేమిటి, అనేక అంశాల పేరిట ఈ అంతర్జాతీయ దినోత్సవాల రూపకల్పన జరిగి, జాతిమత ప్రమేయం లేకుండా విశ్వజనీనమైన సభలూ, సమావేశాలు జరుపుతున్నారు. వీటికీ కొన్ని దేశీయమైన బంధాలు పెట్టడం జరుగుతోంది. బాలల ప్రపంచదివసం నవంబరు 20 అయితే, మన దేశవ్యాప్తంగా దాన్ని చాచా నెహ్రూ జన్మదినం నవంబరు 14 తో ముడివేసేశారు ...." అన్నాడు నాగేశం.

"అయితే ఇదే నవంబరు 14 అంతర్జాతీయ మధుమేహ దినంగా జరుపుతున్నారు. కాకతాళీయం కావొచ్చు కానీ ఈ రెండింటి మధ్యా అసంకల్పితమైన అనుబంధముంది. మధుమేహాన్ని ఏ వైద్యంతోనూ వదిలించుకోవడం సాధ్యం కాదు. ఏవో కొన్ని గుణాలు వెంటాడుతోనే ఉంటాయి!" అన్నాడు శాస్త్రి. అతగాడికి రాజకీయ విశ్లేషణలు చెయ్యడం, రంగులు పులమడం అలవాటు.

"రాజకీయం చెయ్యకు. ఇవన్ని ఏం సాధిస్తున్నాయని చెప్పడం కష్టమైనా, మౌలికమైన కొన్ని సామాజికాంశాల గురించి ప్రజల్ని ఆలోచింపజేసి చైతన్యవంతుల్ని చేస్తున్నాయని అనుకోవచ్చు కదా-?"అన్నాడు నాగేశం.

"నాకు నా పుట్టినరోజూ, పెళ్లయినరోజు తప్ప మరేమీ ముఖ్యం కావు. అంచేత నన్ను నేను ఓ ప్రపంచ పౌరుడిగా పరిగణించే ఈ రెండు వ్యక్తిగతమైన దివసాలూ ప్రపంచ



దివసాలే! అన్నాడు శాస్త్రి. శాస్త్రి ఎదుటివారి మాటల్ని సులువుగా ఒప్పుకోడు. వ్యతిరేకించడం అతనికి మహసరదా. అందుకనే అతనితో వాదించడం ఒక విధంగా కష్టమే! అయినా స్నేహితులు ఏమీ అనుకోకుండా వినోదం పంచుకుంటారే కానీ విరోధం పెంచుకోరు. అప్పుడప్పుడు వాళ్లూ మర తిప్పి వదుల్తారు. "ఏడువందల కోట్ల ప్రపంచ జనాభాలో నువ్వు అల్పబుద్ధివి కాదుకానీ, మాలాగే సాధారణమైన ఓ స్వల్ప బుద్ధి మానవుడివి. ఏ ప్రాతిపదిక మీద, లేదా ఏ ప్రమాణం మీద నీకు సంబంధించిన ఈ రెండు రోజుల్నీ అంతర్జాతీయంగా పరిగణించాలి?" సీతాపతి అడ్డు పడ్డాడు.

"జాతి మతాల అంశాలు లేకపోయినా వ్యాపార వాణిజ్య అంశాలు అంతర్లీనంగా కొన్నిటితో పెనవేసుకు పోయాయి. లౌకికవాదంతో పండుగలను, ఖర్చులను గేలి చేసే విజ్ఞులు ఈ ప్రపంచ దివసాల ఆర్భాటాల్ని నిరసించరు. అసలు మన పండుగలకు ఏదో మూలకారణం ఉండేది. అయితే నేపథ్య చరిత్రల ఆధారాలు తెలుసుకోకుండా, తెల్లతోలుగాళ్ళు ఏదంటే దాన్ని మనం గుడ్డిగా ఆచరణలో పెట్టేస్తున్నాం. ఉదాహరణకి ప్రేమికుల దినాన్నే తీసుకోండి. ప్రేమికుల దినాన్ని నిరసించిన మనలాంటి వారిని దుర్భాషలాడి నగర యువత పలు రాష్ట్రాలలో కాని పనులు చేసి అభాసు పాలైయ్యింది.

(ఇంకా వుంది)




Photo by K. Mitch Hodge on Unsplash



# వేదులాన్వయు పలుకు -3



వేదుల సుబ్రహ్మణ్యం

చట్టమును కొద్దిగా వంచి జనుట కద్దు
మొత్త ముల్లంఘనము జేయ ముప్పు కలుగు
హద్దు దాటిన నేచట్ట మాదు కొనదు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 41

ఊరకుక్కల బాధల కోర్వలేక
ఊరు విడనాడు టేమంత ఒప్పు కాదు
దండమును బట్టి దూరము తరుము టొప్పు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 42

తనకు సంపద యుండియు ధరిని వేరె
యొరుల సంపద చూచిన నోర్వలేని
గుణము మనసుకు శాంతి చేకూర్చ దెపుడు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 43

తనకు లేదని బాధతో తల్లడిల్లి
ఒరులకుందని కుందుట నుర్వి తగదు
ఉన్న దానితో సంతుష్టి నొందు టొప్పు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 44

జంకు లేకుండ "కోర్టు"లో బొంకు సాక్ష
లుండ జేకూరునే న్యాయ మొకరికైన
న్యాయదేవత కనుగప్ప న్యాయమగునె!
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుక 45

దారి తప్పయి గమ్యము చేరలేక
మనసు కట్టడి తప్పిన మనుగడందు
శాంతమును సౌఖ్యముండవు సుంతయైన
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 46

సంఘసేవకు ధనమెల్ల సంతరించి
చిల్లి గవ్వయు కోరక సేవ జేయు
వారి నెల్లర శ్లాఘింపవలయు నెపుడు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 47

చెంత నుండిన విలువల చింత రాదు
దూరముండగ కొండను దోచు నునుపు
దరికి జేరగ దోచును గరుకు నిజము
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుక 48

ఋజువు లేకుండ నమ్మరు నిజము నెవరు
మనసు నూహించి నమ్ముట మంచి కాదు
మంచి చెప్పిన పట్టదు మనసు కెపుడు !
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుక 49

ఒరుల తప్పులు వెదకుట నొప్పు కాదు
తాను చేసిన పనులందు తప్పు లెరిగి
తిరిగి చేయక నుండిన బరగు మేలు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 50

# పూరి జగన్నాథ స్వామి వైభవం

**డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ**



పూరి జగన్నాథుని రథయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైన నది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాథ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాథ క్షేత్ర మాహాత్త్యాన్ని యథామూ లంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

బ్రహ్మ బలరాముని రథం దగ్గరకు వెళ్లాడు.భక్తితో నమస్కరించి ఈ విధంగా స్తుతించాడు.

బ్రహ్మ బలరాముని స్తుతించుట------

“బలరామా! ఆకాశము నీ శిరస్సు. నీరు నీ శరీరము. పాదములు భూమి. అగ్ని నోరు. నీ ఉచ్ఛ్వాశ నిశ్వాసలు, వాయువు, మనస్సు చంద్రుడు. కన్నులు సూర్యుడు. చేతులు ఆకాశము. జ్ఞానమునకు అద్దమువంటి వాడవు అగు నీకు నమస్కారము. పదునాల్గు లోకాలకి నీవే మూలస్తంభం. నీపాదపద్మాలకు నమస్కరించిన వారి పాపాలు పోగొట్టువాడా, అంతులేని కన్నులు, పాదాలు, చెవులు, కన్నులు, చేతులు కలవాడా! అనాదికాలం నుండి మూలరూపం కలవాడా, చీకటికి సూర్యుడు వంటివాడా! వేదమూర్తి! మూడు దోషాలు నాశనము చేయువాడా! మూడు అవతారములు దాల్చినవాడా! పడగలపై భూమిని మోయువాడా! కాలాగ్ని రుద్రా! మహారుద్రా! నీకు నమస్కారము.

పడగలను గొడుగు క్రింద నిద్రించు వాడా! లోకాలను ఉద్ధరించువాడా! నీవే రక్షించువాడవు. నీవే సృష్టించువాడవు. నీవే భక్షించువాడవు. నీవలన మేమందరం బతుకుతున్నాం. ఉపనిషత్తులచే స్తుతించబడిన నారాయణ స్వరూపం నీవే. నీకంటె వేరైనది ఏది లేదు. నీవే అనేక రూపాలలొ కనిపిస్తున్నావు.



నీవే శయ్య. నీవే శయనించు వాడవు. కప్పువాడవు, కప్పబడువాడవు నీవే. విష్ణువు నీవే. బలరాముడు నీవే. మీ ఇద్దరిమధ్య భేదంలేదు" అని బ్రహ్మస్తుతించాడు.(40-51)

లోకాలకు తల్లి అయిన సుభద్రను చూడడానికి బ్రహ్మ సుభద్ర రథం దగ్గరకు వెళ్లాడు.ఆమెకు నమస్కరించి ఈవిధంగాస్తుతించాడు.

బ్రహ్మ సుభద్రాదేవిని స్తుతించుట------------





" దేవి! జగన్మాతా! పరమేశ్వరి! అ ను గ్ర హి ం చు . కా ర్య కారణములు నీవే కల్పిస్తావు. నీకు సర్వశక్తులు ఉన్నాయి. అందరిలో జ్ఞానాన్ని, మోహాన్ని నీవే కల్పిస్తావు. కైవల్యాన్ని, ముక్తిని నీవే ఇస్తావు. నీవే విష్ణుమాయవు. అందరిని మోహింపచేయునది నీవే. విష్ణు వక్షస్థలముపై ఉంటూ ఆయన భావాలకి అనుగుణంగా నడుచుకొను చున్నావు. నీవే లక్ష్మివి, గౌరివి, శచివి,కాత్యాయనివి. అన్ని శక్తులను కల్పించుదానవు నీవే. నిన్ను స్తుతించ డానికి ఎవరు సమర్థులు కారు.అందరికి భద్రమును కల్పించునట్టి సుభద్రవు నీవే. జగన్మాతవు నీవే. స్వామి జగత్పతి! స్త్రీలందరు నీ స్వరూపాలే. పురుషులందరు స్వామి రూపాలే. మీ ఇద్దరకు మధ్య భేదము లేదు.విష్ణు మాయా స్వరూపిణి యగు నీవే మమ్ములను నియమించావు. నీ ఆదేశంపై మేము ఈ కార్యాలు నిర్వహిస్తున్నాము. వృత్తి, ప్రవృత్తి, ఆకలి,నిద్ర అన్ని నీవే. ఆశలు కల్పించునది నీవె, పూర్తిచేయునది నీవే. ముక్తి ఇచ్చుదానవు నీవే. బంధనాలు కల్పించుదానవు నీవే. జ్ఞానాన్ని ఇచ్చుదానా1 కల్పవృక్షము వంటిదానా! నీ పాదాలకు నమస్కారం" అని బ్రహ్మ సుభద్రను ప్రార్థించాడు. అక్కడికి సమీపంలో సుదర్శన చక్రం ఉన్న రథం ఉంది. బ్రహ్మ అక్కడకు వెళ్లాడు. ( 52 - 63)

ఇరవై ఏడవ అధ్యాయం సమాప్తం

(ఇంకా వుంది)

# పంచాంగ శ్రవణం



ప్లవ నామ సంవత్సర పంచాంగం శ్రీ మంగళంపల్లి నరసింహమూర్తి గారు మనకు వినిపిస్తున్నారు. వీక్షించండి.

మంగళంపల్లి నరసింహమూర్తి

# సప్త మోక్ష నగరాలు



కొత్త రామానందం

జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్య మైనది. ఆధ్యాత్మిక లో చెప్పాలంటే దుర్లభమైనది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగవంతుడే పర-మావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయతమైన వారికి జీవితం అపురూపమై నది. మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లక్తి భించదు. అందుకే మహాపురుషులను ఆశ్రయించి, ఆత్మ --పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్ధ కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్ధ కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తు న్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవర్తనను నిరోధించడమే యోగం.

ఎన్ని ఒడుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్రమా-దరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదురైన-ప్పుడు ఏమైనా మహిమాన్విత శక్తి తనకు సహక క్తి రించాలని ఆశించడం సహజం. భగవంతుని అను-గ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే --- భక్తి మార్గం. భగవంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తా డు. అందరికీ ప్రేరణ ఇస్తాడు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుండి విముక్తి చేయ-డానికి ఎన్నెన్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు. వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప నగరాలు ఉన్నాయి. అందు పరమాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపాదృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూ-తనోత్సాహాన్ని నింపుతున్నాడు.. "అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్ష దాయకా" భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప మోక్ష నగరాలు మోక్ష ధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాదిస్తు న్నాయి. అం-దువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపక్తి త్తులు పెరిగి ఆత్మ విచారణ చేయగలుగుతున్నాము. ధర్మ బద్దమైన జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయత్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటినీ సమైక్య పరచి ముందుకు నడిపిస్తోంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్రతిరూపాలు మన పుణ్య క్షేత్రాలు, తీర్థాలు. వాటిలో అనాదికాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్య క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

**అవి అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జ-యిని ) మరియు ద్వారక.**

# కాశీ మహానగరం

హిందూ ఆధ్యాత్మికత, భక్తి తత్వానికి కేంద్రం---- కాశీ పుణ్యక్షేత్రం. అసంఖ్యాక శివలింగాల సమాహారం --- కాశీ క్షేత్రం. జీవితంలో ఒక్కసారైనా కాశీని సందర్శించాలనే పవిత్ర సంకల్పం ప్రతీ హిందువు మదిలోను ఉంటుంది. కాశీ యాత్ర అనేది అనేక కారణాల రీత్యా ప్రతీ హిందువు చేయవలసి ఉంటుందని, ఇది వారి ప్రాథమిక ధర్మం అనీ కాశీ ఖండం పేర్కొంటుంది. భక్తుల ముక్తి సాధనకు సోపానం, కాశీ యాత్ర---- కాశీ యాత్ర.

కాశీ యాత్రలు పలు రకాలుగా ఉన్నవి. అవి 1. పంచ కోశి పరిక్రమ 2. శివ యాతన యాత్రలు 3. గౌరీ యాత్ర 4. నవ గ్రహ యాత్ర 5. ఏకా దశ మహారుద్ర యాత్ర. 6. జయ తీర్థ యాత్ర 7. అంత గ్రహ యాత్ర 8. దుర్గా దేవి యాత్ర .

ప్రతీ ఏటా కోట్లాది మంది కాశీ క్షేత్రాన్ని సందర్శించుకుంటారు. కానీ అందులో చాలా మంది అసలు కాశీ యాత్ర ఎందుకు చేయాలి? ఎలా చేయాలి? అక్కడ నిర్వహించ వలసిన క్రతువులు ఏమిటి ? వాటిని ఎవరు నిర్వహిస్తారు? కాశీ యాత్రలో సందర్శించవలసిన ప్రదేశాలు ఏవి? అసలు కాశీ యాత్ర అర్థం పరమార్థం ఏమిటి? అనే పలు విషయాల పట్ల సరైన అవగాహన ఉండదు. ఈ అంశాలను తెలుసుకునే ప్రయత్నం ఇప్పుడు చేద్దాం.

కాశీ యాత్రను ప్రధానంగా చేసేది పితృ కర్మలను నిర్వహించడం కోసం అనేది చాలా మందికి తెలిసిన విషయమే. అయితే ఈ యాత్రలను కాశీ లోనే ఎందుకు నిర్వహించాలి? అని అంటే కాశీ అనేది పవిత్ర జీవనది గంగానది ఒడ్డున, హిందూ మతానికి కేంద్ర బిందువుగా వెలసిన అత్యంత మహిమాన్వితమైన క్షేత్రం కాబట్టి చెప్పవలసి ఉంది. కాశీయాత్రనే కాశీ పరిక్రమ అని కూడా ఉంటారు. కాశీనే వారణాసి, బెనారస్ అని కూడా పిలుస్తారు. పైన ప్రస్తావించిన పలురకాల కాశీ యాత్రలన్నీ సంవత్సరములోని వివిధ సమయాలు, సందర్భాలలో జరుగుతాయి. కాశీయాత్ర అనేది సర్వ పాపాలనూ హరించే మహిమ గల యాత్ర అనేది హిందువుల బలమైన విశ్వాసం. ఇది మోక్ష ప్రాప్తిని కలిగిస్తుంది. కాశీలో పితృ దేవతలకు తర్పణాలు, వారిని సంతుష్టి పరిచే కర్మలు నిర్వహించినవారికి



ఆ పెద్దల ఆశీస్సులు లభిస్తాయి. దీనితో పాటు కాశీలోని ఇతర పుణ్య ప్రదేశాలను కూడా సందర్శించుకోవాలి. కాశీ ప్రదేశమంతా ఎంత పుణ్యప్రదమైనదంటే ప్రతి అణువులోనూ కాశీ విశ్వేశ్వరుడు కొలువై ఉంటారు.

కాశీయాత్రలోని. ఆంతర్యం, అంతరార్ధం

పవిత్ర గంగానదీ తీరంలో హిందూమత ఆధ్యాత్మిక ఆత్మగా వెలసిన అతి పురాతన పట్టణం కాశీ పట్టణం. కాశీ, వారణాసి, బెనారస్ వంటి పలు పేర్లతో పిలువబడే ఈ కాశీ క్షేత్రం ఏంతో పవిత్ర పట్టణం దివంగతులైన పెద్దల ఆత్మలకు శాంతి కలిగించే పలు క్రియలకు వేదిక కాశీ సాధారణంగా పితృ తర్పణ కార్యాలను పవిత్ర నాదీ తీరాలలో చేయడం మంచిదైతే కాశీలో గంగానది తీరంలో నిర్వహించడం అత్యంత పుణ్యప్రదం. కాశీలోని కాకుండా ఇటువంటి కర్మలను ఆచరించే యాత్రను మూడు ప్రదేశాలలో నిర్వహిస్తారు. అందులో మొదటిది 'గయ'. బుద్ధుడు ఆత్మజ్ఞానాన్ని పొందిన పవిత్ర ప్రదేశం గయ. అలాగే అలహాబాద్ లోని ప్రయాగ రెండవ పుణ్యప్రాంతం. ఇది గంగ, యమున, సరస్వతి నదుల పవిత్ర సంగమ క్షేత్రం. మూడవది రామేశ్వరం. కాశీయాత్ర అంటే కేవలం కాశీ పట్టణాన్ని మాత్రమే సందర్శించడం కాదు. అతి పురాతనమైన, అత్యంత శక్తివంతమైన రెండు జ్యోతిర్లింగ శివ క్షేత్రాలను సందర్శించడం వలెనే కాశీయాత్ర సంపూర్ణమవుతుంది. అది ఒకటి విశ్వనాథుడు కొలువైన క్షేత్రం, రెండవది రామేశ్వరుడు కొలువైన రామేశ్వర క్షేత్రం.

అయిటర్ కాశీకి పోవాలన్న ప్రతి ఒక్కరూ కాశీకి వెళ్లి కాశీ విశ్వనాధుని, విశాలాక్షిని దర్శించుకోలేరు. కారణం గత జన్మలో ఎన్నెన్నో ఆలయాలను దర్శించుకుని పూజించినవారికే, ఈ జన్మలో కాశీ తలుపులు తెరచుకుంటాయి అని చెబుతుంది శివపురాణం. ఏడు ముక్తిక్షేత్రాలలో ఒకటిగా కీర్తించబడుతున్న కాశీలో పన్నెండు జ్యోతిర్లింగేశ్వరులలో ఒకరైన శ్రీ విశ్వనాథుడు కొలువై భక్తులను అలరిస్తున్నాడు. 'ఈ పవిత్ర భూమిని నా నివాస యోగ్యంగా మార్చుకున్నాను, ఇకపై ఈ నగరాన్ని వదిలి ఒక్కరోజూ బయటకు వెళ్ళలేను' అంటూ విశ్వనాథుడు ప్రమాణపూర్తిగా చెప్పినట్టు లింగపురాణంలో ఉంది.

కాశీ అనే పేరుకు కాంతి నిచ్చే స్థలం అని అర్ధం. జగద్గురు ఆది శంకరాచార్య, తులసీదాసు, కబీరు, గౌతమ బుద్ధుడు దర్శించిన పుణ్యధామం ఇది. అతి పురాతనమైన ఈ నగరానికి వయసు నాలుగు సంవత్సరాలకు పైనే. ఇంకా గంగానదికి ఉత్తరంగా 'వరుణ' నది, దక్షిణాన 'ఆసి' నది సంగమిస్తున్నాయి. ఈ రెండింటికి మధ్య ఉన్న నగరమవడం వలన వరుణ + ఆసి = వారణాసిగా ఈ స్థలం పిలువబడుతోంది.

హిందూ పురాణాలలో సైతం అతి పవిత్ర ప్రాంతంగా చోటు చేసుకున్న అతి పురాతన పట్టణం కాశీ పట్టణం. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది హిందువులు తమ అంత్య కాలాన్ని కాశీలో గడపాలని కోరుకుంటారు. కాశీలో మరణిస్తే అది నేరుగా స్వర్గానికి చేరుస్తుందనే ప్రగాఢ విశ్వాసం హిందువులలో నెలకొని ఉన్నది. అందుకే విశ్వనాధ ఆలయానికి దగ్గర ఉన్న మణికర్ణికా ఘాట్ లో రోజూ వందలాది మృతదేహాలను అగ్నికి ఆహుతి చేసి అస్థికలను, చితాభస్మాన్ని గంగలో కలిపివేస్తారు. అలా కోరిక తీరనివారు, చనిపోయిన తర్వాత వారి చితాభస్మాలను గంగలో కలిపితే ఏంతో శాంతి పొందుతారు అనే నమ్మకంతో ఎంతోమంది 'ఆస్థి విసర్జన' కార్యక్రమములను నిర్వహిస్తాం-

టారు. హిమాలయాలలో పుట్టి బంగాళాఖాతంలో కలిసేవరకూ గంగమ్మ ఏంతో పవిత్రమైనది. ఒక్కసారి స్నానం చేసినా, స్పృశించినా వారి పాపాలను హరించే మహిమ గంగానదికి ఉన్నాడని యాత్రికుల విశ్వాసం. అందుకు తార్కాణంగా స్వయంగా విశ్వనాథుడే తన సతి విశాలాక్షికి 'గంగామహిమ' తెలియ పరచాడు.

విగతజీవుడైన తన భర్త తలని ఒడిలో పెట్టుకుని ఏడవసాగింది ఒక వృద్ధురాలు. ఆ హృదయ విదారకమైన దృశ్యాన్ని యాత్రికులంతా చూస్తున్నారు. 'ఏయ్ ముసలీ, శవాన్ని ఇక్కడ పెట్టుకుని రోదిస్తావెందుకు? దహనం చేయవచ్చు కదా' అని అన్నారు చుట్టూ ఉన్న వాళ్ళు. ఆ వృద్ధురాలు మరింత దుఃఖంతో 'అయ్యా! నా భర్త చనిపోయేముందు ఓ కోరికను కోరాడు. ఇంతవరకు జీవితంలో ఒక్క పాపం కూడా చేయని వ్యక్తి తనకు దహన సంస్కారాలు చేయాలన్నది ఆయన కోరిక. మాకు సంతాన భాగ్యం కూడా లేదు. మీలో ఎవరైనా పాపం చేయనివారు నా భర్తకు అంత్యక్రియలు చేసేందుకు ముందుకు రండి: అని అభ్యర్థించడం ఆలస్యం, ఆ గుంపు చెదిరిపోసాగింది!

'ఈ ప్రపంచంలో ఒక్క పాపం కూడా చేయకుండా ఉండటమా?' అనుకుంటూ వెళ్ళసాగారు. గంటలు గడుస్తున్నా ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. ఒక యువకుడు అక్కడకి వచ్చాడు. విషయం తెలుసుకున్నాడు. 'అవ్వా! మీ ఆయనకు నేను అంత్యక్రియలు చేస్తాను. నేను నాకు తెలిసినంత వరకు ఏ పాపమూ చేయలేదు. ఒకవేళ నాకు తెలియకుండా ఏమైనా పాపాలు చేసివుంటే, ఆ కాశీ విశ్వనాథుడిని ప్రార్థించి, గంగలో స్నానం చేస్తాను' అని చెప్పి ఆ వృద్ధునికి అంత్యక్రియలు చేసేందుకు ఉపక్రమించాడు. వెంటనే ఆ వృద్ధుడు, వృద్ధురాలు కాశీ విశ్వనాథుడు, విశాలాక్షిగా ప్రత్యక్షమయ్యారు. ఆ యువకుని ఆశీర్వదించారు. ఈ కథ విన్నవారికి గంగానది పవిత్రత, అందు స్నానం చేస్తే సర్వపాపాలు హరింపబడతాయని సుబోధమవుతుంది.

యాత్రికులు కాశీలో ఉన్న ఆలయాలను ఒకదాని వెంబడి రెండవ దానిని భక్తితో దర్శనం చేసుకుంటారు. హైందవ సాంప్రదాయాలపై నమ్మకమున్నవారు కనీసం తొమ్మిది రోజులు కాశీలో నిద్ర చేసి, కాశీ విశ్వేశ్వరనాథుని దర్శనం చేసుకుంటూ నియమబద్ధమైన జీవితాన్ని గడిపి ధన్యులవుతారు. గంగా స్నానమాచరించిన పిమ్మట భక్తులు ప్రథమంగా కాశీనగరం క్షేత్ర పాలకుడైన కాలభైరవ ఆలయాన్ని దర్శించటం ఒక అలవాటు.

పూర్వం బ్రహ్మదేవునికి తానే సర్వాధికారినన్న గర్వం పొడచూపింది. శివహేళన చేయసాగాడు. ఒకానొక దశలో అక్కడ ప్రత్యక్షమయిన శివుడు తన ఆవులింత నుండి భైరవుని సృష్టించి, బ్రహ్మ ఐదవ తలను త్రుంచివేయమన్నాడు. వెంటనే భైరవుడు బ్రహ్మ ఊర్ధ్వముఖాన్నిత్రుంచివేయగా, అతనికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. శివుని ఆజ్ఞతో భైరవుడు బ్రహ్మ కపాలాన్ని చేతిలో ధరించి, భిక్షాన్ని స్వీకరిస్తూ కాపాలికా వ్రతంతో సంచరించసాగాడు. చివరకు భైరవుడు కాశీ నగరం ప్రవేశించగానే బ్రహ్మ కపాలం నేలపై పడిపోయింది. అప్పటినుండి భైరవుడు విశ్వేశ్వరుని ఆజ్ఞపై కాశీ నగర క్షేత్రపాలకుడిగా పదవి పొంది, అక్కడ కొలువై, తనను దర్శించుకున్న భక్తుల మనోరథాలు నెరవేర్చిమ్ వారి పాపాలను పోగొడుతున్నాడు.

# నూటపదహార్లు కందాల్లో
# సుందరకాండ



పాలెపు బుచ్చిరాజు

## మనవి

వాల్మీకి రామాయణం మహోత్కృష్టమైన కావ్యం. ఎవరె న్నిసార్లు రాసినా ఇంతకంటే ఎక్కువగా ఏం చెప్పగలరు? యావద్భారత దేశంలో ఎన్నో భాషల్లో ఎందరో మహానుభావులు రచించి, చదివి, విని ధన్యులయ్యారు. ఉత్తర భారత దేశంలో గోస్వామి తులసీదాసు రచించిన "రామచరితమానస్" కి ఉన్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. అఖండ రామాయణ పారాయణం, సుందర కాండ పారాయణం, హనుమాన్ చాలీసా ప్రతి రోజూ ఎక్కడో ఒక దగ్గర వినిపిస్తూనే ఉంటాయి. తెలుగులో కూడా వెయ్యేళ్ళుగా వేలాది భక్తులు రామాయణాన్ని రాసి, చదివి, విని తరించారు.

రామాయణంలో రాముడి తరవాత విశిష్టమైన పాత్ర హనుమది. స్వామి భక్తికి, కార్య దీక్షకి, బుద్ధికుశలతకి కొలమానంగా చిత్రించాడు వాల్మీకి. అసలు రామాయణంలో సుందర కాండ ప్రత్యేకంగా హనుమ కోసమే సృష్టించ బడింది అనిపిస్తుంది. సీతాన్వేషణలో హనుమ చేసిన అద్భుత కార్యాలకి అబ్బురపడి శ్రీరాముడు "నువ్వు నా తమ్ముడు భరతుని వంటి వాడవ"ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. భక్తి తత్వానికి ఉదాహరణగా రచించ బడింది కనుకనే సుందర కాండ ప్రత్యేకంగా పారాయణకి నోచుకుంది.

నాటి రామదాసు, త్యాగరాజు నుంచి, నేటి ఎం.ఎస్. రామారావుగారి వరకు ఎందరో మహానుభావులు శ్రీరామ హనుమలను కీర్తించడం ద్వారా ధన్యులయ్యారు.

వారిని స్ఫూర్తిగా తీసుకుని 'వంద కందాల్లో సుందర కాండ' రాద్దామనే ప్రయత్నం చేశాను. 'అష్టోత్తర శతం' దాటినా హనుమంతుని తోకలా పెరుగుతూ పోయింది. ఆఖరికి 'నూటపదహార్లు' తో పూర్తి చేయ గలిగాను. చదువరులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఆఖర్న అనుబంధంగా "పురజన గీత" గా పద్దెనిమిది కందాలు చేర్చాను. పట్టాభిషేకం తరవాత శ్రీరాముడు తమ్ముల్ని, మంత్రుల్ని, సామంతుల్ని, సైన్యాన్ని ఉద్దేశంచి ఎవరెలా మసలుకోవాలో మాట్లాడాక, పుర ప్రజల్ని కూడా పిలిపించి వారికి భక్తి తత్త్వం బోధిస్తాడు. ఆ కారణంగానే దీనికి 'పురజన గీత' అని పేరు. తులసీ రామాయణం ఆధారంగా రాసిన పద్యాలు.

బరోడా

పాలెపు బుచ్చిరాజు

33) ఆకాశమంత నోటితొ
రాకాసిని బోలి సురస రారమ్మనియెన్
ఏకాకి దొరికితివిదియె
ఆకలి గొని యుంటి నిన్ను హాయిగ తిందున్

33. సురస మారుతిని అడ్డగించి, "నాకు భలే ఆకలిగా ఉంది. ఒక్కడివే నువ్వు నాకు బాగా దొరికావు. నిన్ను మింగేస్తాను రా!" అని పెద్దగా నోరు తెరిచింది. మారుతి అంతకంటే పెద్దగా అయ్యాడు అలా పెరుగుతూ పోయి, ఆమె ఆకాశమంత నోరు తెరిచింది,

34) లొంగక భీకర రూపుడు
అంగుళమాత్రుడయి దూరె నంగన నోటన్
చెంగున యుదరము చేరెను
అంగలు వేయుచు బయటికి అంజని వచ్చెన్

34. ఆసమయంలో హనుమ ఉన్నట్టుండి తన చతురత చూపించి, అంగుళమంతగా మారి, ఆమె నోట్లో ప్రవే-శించి చటుక్కున బైటికి వచ్చాడు.

35) అమ్మా! తీరెను ఆకలి
పొమ్మా నా దారి విడిచి పోవలె నమ్మా
అమ్మను జూడగ లంకకు
ముమ్మార్ధింతు నంచు ముందుకు పోయెన్

35. "అమ్మా! నీ ఆకలి తీరింది కదా! ఇక నీ దారిన పో! నేను రాముని భార్య సీతమ్మను వెదకడానికి లంకకు పోతున్నాను. నిన్ను వేడుకుంటాను" అని వెళ్ళిపోయాడు. రెండో అడ్డంకి అలా తొలగింది.

36) అక్కడితో నాగక యొక
రక్కసి సింహిక తినంగ రాముని బంటున్
ఒక్కడిగ దలచి కేసరి
నక్కడె బంధించగ నడియాసతొ యుండెన్

36. అక్కడితో ఆయన కష్టాలు తీరలేదు. సముద్రంలో సింహిక అనే రాక్షసి ఉంది. అది హనుమంతుని నీడ నీటి మీద పడుతూ ఉంటే, దాని ఉనికిని బట్టి, హనుమంతుని ప్రయాణం ముందుకు సాగకుండా అడ్డుకో సాగింది. ఒక్కడే ఉన్నాడు పోరాడ లేడు అని ఆయన్ను తినేద్దామనే ఆశతో ఉంది.

37) అప్పటికె విసిగి యుండిన
యప్పవన కిశోరుడామె నల్లన చేరెన్
చప్పున పొట్టను చీల్చెను
తప్పులు చేసిన ఫలితము తప్పదు ధరలో

37. అప్పటికే హనుమ ఎదురు పడిన అవరోధాలతో విసిగి పోయి ఉన్నాడు. సమయం వృధా అయిందని బాధ పడుతున్నాడు. ఇంక ఆలస్యం తగదని, దాని నోట్లో దూరి, శరీరం పెంచి, కడుపు చీల్చి బైటికి వచ్చాడు. సింహిక దెబ్బకి చచ్చి పడింది. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు కదా!.

38) అవరోధములేర్పడినను
అవలీలగ నధిగమించి ఆగక పోగా
జవగల ధీరుడని తెలుపు
పవన సుతుని బోలు వీర భక్తుల గాథల్

38. ఇలా అంజనేయుని కథలు విన్నవారికి కార్యశూరుడు ఎలా మసలు కోవాలో, అనుకున్న పని మధ్యలోనే ఆపకుండా ఎలా సాధించాలో, బాగా అవగాహన కలుగుతుంది కదా!.

39) ఆదరికి జేరె మారుతి
పాదములొక కొండ మోపి పరికించంగా
ఆదర్శనమున హాయిగ
మోదము నొందెను హృదయము మోజులు పడియెన్

39. ఏమైతేనేం, నూరామడల దూరం ఎగిరి సముద్రం మధ్య ఉన్న లంకలో దిగాడు హనుమంతుడు. ఆ దిగడం, దిగడం, తిన్నగా ఒక పర్వత శిఖరం మీద దిగాడు. అక్కడి సుందర దృశ్యాలు చూస్తూ ఉంటే ఆయనకి చాలా ఆశ్చర్యం కలిగింది.

40) ఏమందమేమియందము
ఏమంచు బొగడ గలంగ మీ నగరంబున్
శ్రీమంతులెంత దనుజులు
ధామంబుల కాంచనంబు ధగధగ మెరిసెన్

40. ఔరా! ఈ లంకా పట్టణం ఎంత అందంగా ఉంది! ఎంత పొగిడినా తక్కువే! ఇక్కడి రాక్షసులెంత ధనవంతులో! ప్రతీ ఇల్లూ బంగారంతో సాయంత్రపు సూర్య కాంతిలో ధగధగమెరిసి పోతోంది.

(సశేషము)

# గ్రీసు దేశపు పురాణ గాథలు



## వేమూరి వేంకటేశ్వరరావు

"Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence."
Aldus Huxley. "Knowledge and Understanding"

## ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, "మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి," అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా "ఇరవై నిమిషాల కార్యక్రమం" చూద్దామని వెతకడం ఉపక్రమించేను. "అపస్వరం అనే ఏపిల్ పండు కథ" ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.
పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, "చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను" అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అనిపించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.
ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

# 8. ట్రోయ్ సంగ్రామం నిజమా? కల్పనా?

భారత యుద్ధం గురించి చదువుతున్నప్పుడు వచ్చే రకం సందేహాలే ట్రోయ్ సంగ్రామం గురించి కూడా వస్తాయి. ఈ కథ పురాణమా? ఇతిహాసమా? ఈ యుద్ధం నిజంగా జరిగిందా? జరిగితే ఎప్పుడు జరిగింది? యుద్ధంలో కనిపించే సంఘటనలు, పాత్రలు (మనుష్యులు, దేవతలు) నిజమా? కల్పనా? ఈ యుద్ధం గురించి ఎవ్వరు రాసేరు? ఎప్పుడు రాసేరు? వగైరా, వగైరా!

ట్రోయ్ లో జరిగిన యుద్ధం నిజమా కల్పనా అన్న ప్రశ్నని పక్కకి పెడితే ఈ కథ యొక్క ప్రాముఖ్యత అర్థం అవుతుంది. ఎంతమంది చరిత్రకారులు, కవులు, కళాకారులు, పరిశోధకులు, ఎన్ని తరాలబట్టి ప్రభావితులు అవుతున్నారో చూస్తే ఈ కథ యొక్క గొప్పదనం అర్థం అవుతుంది. యుద్ధంలో ప్రతి చిన్న సంఘటనని హోమర్ వర్ణించి చెబుతూ ఉంటే, "ఇంత విపులమైన వర్ణన నిజం కాక కల్పన ఎలా అవుతుంది" అనిపిస్తుంది. మహాభారత యుద్ధం తిక్కన వర్ణించిన తీరు చూసినప్పుడు కూడా ఇదే రకం భావం కలుగుతుంది.

ఈ యుద్ధం గురించి మనకి ఉన్న ముఖ్యమైన ఆధారాలు గ్రీకు సాహిత్యంలో కనిపిస్తాయి; కానీ ఏ ఒక్క చోట మనకి సాధికారంగా ఆధారాలు కనబడవు. ఈ యుద్ధం నిజంగా జరిగి ఉంటే అది సా. శ పూ. 1194-1184 మధ్య కాలంలో జరిగి ఉండవచ్చని గ్రీకు శాస్త్రవేత్త ఎరతోస్తనీస్ (Eratosthenes, సా. శ పూ. 276-194) వేసిన అంచనా నమ్మదగ్గదే అనడానికి అధారాలు కనిపిస్తున్నాయని పురావస్తు పరిశోధకులు అభిప్రాయపడ్డారు. అనగా, కంచు యుగపు చివరి దశలో అని మనం చెప్పుకోవచ్చు.

సా. శ. 1870 లో జెర్మని దేశపు వాణిజ్యవేత్త, ఔత్సాహిక పురావస్తు పరిశోధకుడు హైన్రిక్ షలైమన్ (Heinrich Schliemann) పశ్చిమ టర్కీలో (ట్రోయ్ నగరపు సమీపంలో) జరిపిన తవ్వకాలలో ఒక శిధిలమైన కోట దిబ్బ, దాని చుట్టూ 25 మీటర్ల లోతు వరకు శిధిలమైన భవనాల అవశేషాలు కనిపించేయి. వాటి చుట్టూ 46 ఇతర వాటికలు కనిపించేయి. ఇటీవల జరిపిన మరికొన్ని తవ్వకాలలో కనబడ్డ ఒక పురాతన నగరం హైన్రిక్ షలైమన్ కనుక్కున్న నగరం కంటే పదింతలు పెద్దది అని తెలిసింది. ఈ నగరం ఉన్న ప్రాంతాలలో సా. శ. పూ. 3000 నుండి సా. శ. పూ. 1350 వరకు అవిరామంగా జనావాసాలు ఉండేవని తీర్మానించేరు. అంతేకాదు. సా. శ. పూ. 1180 కి సంబంధించిన స్తరాలలో వేడికి మాడిపోయిన అవశేషాలు, మానవ అస్థి పంజరాలు కనిపించడంతో అవి ఏదో యుద్ధానికి సంబంధించినవే అయుంటాయని నమ్ముతున్నారు.



ఈ నగరం గురించి, అక్కడ జరిగిన యుద్ధం గురించి, ఆనోటా, ఈనోటా, జానపదులు నోటా 400 సంవత్సరాల తరువాత విన్న కథలని హోమర్ ఇలియాడ్, ఆడెస్సి అనే రెండు ఉద్గ్రంథాలలో పొందుపరచి ఉంటాడు. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం


ఇలియాడ్ సంకలనం సా. శ పూ. 750 లోను, ఆడెస్సి సంకలనం సా. శ పూ. 725 లోను పూర్తి అయి ఉంటాయి. ఇలా సంకలించబడ్డ కథల సమాహారం లిఖిత రూపం దాల్చేసరికి మరికొన్ని దశాబ్దాలో, శతాబ్దాలో పట్టి ఉండవచ్చు.

అసలు హోమర్ అనే వ్యక్తి ఉన్నడా అని ప్రశ్నించేవాళ్ళు కూడా ఉన్నారు. కొన్ని గ్రీకు మాండలికాలలో "హోమర్" అంటే గుడ్డివాడు అని అర్థం వస్తుంది కనుక "హోమర్" గుడ్డివాడయి ఉంటాడని కొందరి తీర్మానం. ఎందుకంటే ఆడేస్సి లో ఒక చోట ఒక అంధుడు పాత్ర వచ్చి యుద్ధంలోవిశేషాలని కథల రూపంలో చెబుతాడు. హోమర్ ఈ విధంగా తాను చెబుతున్న కథలో తానే ఒక పాత్రలా వచ్చేడని వీరి అభిప్రాయం. వ్యాసుడు కూడా భారత కథలో అక్కడక్కడ "అతిథి నటుడు" గా వస్తూ ఉండడం గమనార్హం.

ఈ కథని చారిత్రక పరిశోధన కోణం నుండి విశ్లేషించడం కష్టం. ఈ కథలో తారసపడే చాల పాత్రలు దైవాంశ సంభూతులు (demigods) - అనగా దేవతలు, మానవులు కలవగా పుట్టినవారు. ఉదాహరణకి హెలెన్ ఒలింపియను దేవత అయిన జూస్ ఒక హంస




రూపంలో వచ్చి మానవ వనిత లేడాని బలవంతం చెయ్యగా పుట్టిన సంతానం. అదే విధంగా హెలెన్ ని పేరిస్ వశపరచుకోడానికి టైటన్





దేవత ఏఫ్రొడైటి ఇచ్చిన వరం కారణభూతం అవుతుంది. ఈ రకం సంఘటనలు నిజ జీవితాలలో జరగడం అనేది మన అనుభవాలకి అతీతం. అలాగే యుద్ధం పది సంవత్సరాలు జరుగుతుంది. కంచు యుగంలో ట్రోయ్ నగరాన్ని పది రోజులు దిగ్బంధం చేసేరంటే నమ్మవచ్చేమోకాని పదేళ్లు - అది కూడా నావికా దిగ్బంధం - కొంచెం అతిశయోక్తి అనిపిస్తుంది.

ఈ సమాచారం అంతటిని దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే ట్రోయ్ అనే నగరం ఉండి ఉండవచ్చు. ఆ నగరం వద్ద పెద్ద యుద్ధం జరిగి ఉండవచ్చు. ఆ యుద్ధం జరగడానికి హెలెన్ అనే అందమైన ఆడదానిని పేరిస్ అనే యువకుడు అపహరించడం కారణం అయి ఉండవచ్చు. ఆ యుద్ధంలో గ్రీకు సైనికులు ఒక కొయ్య గుర్రంలో దాగుని దొంగచాటుగా ట్రోయ్ నగరంలో ప్రవేశించి ఆ నగరాన్ని నాశనం చేసి ఉండవచ్చు. ఇవన్నీ నిజంగా జరిగిన సంఘటనలే కావచ్చు. కానీ ఈ కథలో కనిపించే దేవతలు, వారికీ మానవులకి మధ్యనున్న సంబంధ బాంధవ్యాలు మన అనుభవ పరిధిలో నమ్మడానికి వీలు లేనివి. వీటిని కవి కల్పించిన ఉత్ప్రేక్షలు అనే అనుకోవాలి.

(గతసంచికతరువాయి)

# ప్రేమంటే ఇంతే

ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



అనూరాధకి ఇల్లంతా చూపించారు కృష్ణమోహన్ దంపతులు. ఆ ఇల్లు చూసి రుక్మిణి ఇల్లు ఎంత అందంగా వుంచిందో అనుకొని అదే మాట రుక్మిణితో అంది. పెద్దవాళ్ళు ముగ్గురూ హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"మన అతిథికి ఒక వేడి కాఫీ ఇవ్వవా?" అని సడన్‌గా అన్నాడు కృష్ణమోహన్.

"ఇప్పుడు పదకొండు అవుతున్నాది, ఇప్పుడు కాఫీ ఏమిటి" అని లేస్తున్న రుక్మిణి చెయ్యి పట్టుకొని కూర్చోపెట్టింది అనూరాధ.

"అబ్బే అది మీ మీద ప్రేమతో కాదు, ఆయనకి కాఫీ కావాలి" అంటూ వంటింట్లోకి వెళ్ళింది రుక్మిణి.

"ఏమిటి మేడం తమరు ఎప్పుడూ రాత్రి పదకొండు గంటలకి కాఫీ తాగలేదా?" అని రాధ కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు కృష్ణమోహన్.

"షటప్, అవన్నీ ఇప్పుడెందుకు?" అని కళ్ళతో మందలించింది అనూరాధ.

రుక్మిణి తెచ్చిన కాఫీ త్రాగి మరో అర గంట కబుర్లు చెప్పుకున్నాక, రుక్మిణి పిల్లలున్న గదిలోకి వెళ్ళి "సుప్రియ, ఆంటీ ఇక్కడ పడుకుంటారు, నువ్వు ఇవాల్టికి హాల్లో పడుకో" అని వంశీతో చెప్పి అక్కడ బెడ్ షీట్స్ తలగడ గలీబులు అవి మార్చి అనూరాధ పడుకోడానికి ఏర్పాట్లు చేసింది.

"సార్ మా అపాయింట్‌మెంట్ గురించి ఏమిటి ఆలోచించారు?" అంది రాధ.

"డోంట్ వర్రీ, నాకు గుర్తుంది. సబర్ రఖో...రాధా ఇంక పడుకో,

ప్రొద్దున్నే ఐదు గంటలకల్లా రుక్మిణి లేచి కాలకృత్యాల తరువాత పూజా కార్యక్రమం పూర్తి చేసుకొని వచ్చేటప్పటికి రాధ కూడా లేచింది. అప్పుడు సమయం ఐదూ ఏభై అయింది. "గుడ్ మార్నింగ్, రాత్రి నిద్ర పట్టిందా, ఇంకాస్సేపు పడుకోలేక పోయావా?" అంది రుక్మిణి.

"వెరీ గుడ్ మార్నింగ్, నాకు ఐదున్నరకి లేవటం అలవాటు"

"OK ఫ్రెష్ అవు, కాఫీ కలుపుతాను"

"బావ లేచాక తాగుదాము"

"ఆయన రోజూ ఏడు, ఏడున్నరకి లేస్తారు, శెలవు రోజున ఎనిమిది దాకా పడుకుంటారు. ఎనిమిది గంటలకి అవినాష్ ఇంటికి వెళ్ళాలి కనుక ఇవాళ ఏడింటికి లేపమన్నారు. అందుకని కాఫీ త్రాగి నువ్వు తెమిలిపో"

"బాగుంది చిన్న పిల్లలలాగ లేపడం కూడానా! అయ్యగారికి బద్ధకం బాగా పెరిగినట్లుంది"

"రాత్రి ఆలస్యంగా పడుకుంటారు అందుకని ఆలస్యంగా లేస్తారు, కానీ ముఖ్యమైన పని వుంటే ఆయనే ముందు లేస్తారు"

"బెంగాల్‌లో పుట్టినందుకు ఆ అలవాట్లు వచ్చాయని వేళాకోళం ఆడేవాడు" అంది అనూరాధ. ఇద్దరూ నవ్వుకున్నారు.

ఏడు గంటలకి కృష్ణమోహన్ లేచి హాల్లోకి వచ్చి "గుడ్ మార్నింగ్ రుక్కు అండ్ రాధా" అన్నాడు.

"గుడ్ మార్నింగ్, మీ ఆవిడ లేపకుండానే లేచావు కొంపదీసి మా మాటలు విన్నావా?" అంది అనూరాధ.

"అంటే నా గురించి మీరిద్దరూ ఉన్నవీ, లేనివీ చెప్పుకొని మీ ఇద్దరూ నాతో పడ్డ కష్టాలు ముచ్చటించుకున్నారన్నమాట"

"బెడ్ కాఫీ కావాలా? తరువాత ఇవ్వనా, తొందరగా తెమలండి" అంది రుక్మిణి

"కాఫీ ఇచ్చెయ్యి, ఏకంగా స్నానం చేసి వస్తాను"

కృష్ణమోహన్ రడీ అయేసరికి బ్రేక్ ఫాస్ట్ తయారు చేసి అనూరాధ, కృష్ణమోహన్‌లకి డైనింగ్ టేబుల్ మీద పెట్టి "అనూ రా టిఫిన్ పెట్టాను" అని పిలిచింది రుక్మిణి. టేబుల్ దగ్గరకి వచ్చి రెండు ప్లేటులే వుండటం చూసి "నీకో" అని అడిగింది అనూరాధ.

"నేను తరువాత పిల్లలతో తింటాను" అంది రుక్మిణి.

"అదేమిటి నువ్వు మాతో రావా?"

"సారీ నేను రావడంలేదు మీరిద్దరూ వెళ్ళి రండి, రేపు సుప్రియ ప్రయాణం, తను తీసుకువెళ్ళవలసిన వస్తువులు సమకూర్చాలి, పనిమనిషి వస్తుంది బట్టలు ఉతికించాలి. అదీగాక మూడురోజులైంది ఇల్లు వదిలి కాస్త సర్దాలి". రుక్మిణి కావాలనే వా-

రిద్దరినీ పంపించి ఏకాంతంగా మాట్లాడుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాడని అనూరాధకి అర్థం అయ్యింది. ఇంతలో కృష్ణమోహన్ వచ్చి కూర్చుని, టిఫిన్ తింటూ "మనిద్దరమూ వెళ్లొద్దాము, రేపు సుప్రియ ప్రయాణం కదా రుక్కూ బిజీగా వుంటుంది" అన్నాడు.

కృష్ణమోహన్, రాధ కారులో ఎనిమిది గంటల కల్లా బయలుదేరారు. స్టీరియో ఆన్ చేస్తే అందులో మళ్ళీ "మెరె సపునోకి రాని కబ్ ఆయేగితూ" పాట వచ్చింది. ఆ పాట తను కూడా పాడుతూ నడుపుతున్నాడు.

"ఇంకా రాలేదా?" అని అడిగింది.

"లేదు ఇంకా కాస్త దూరం వుంది"

"ఏమిటి"

"అవినాష్ ఇల్లు"

"బాబూ నేనడిగింది అవినాష్ ఇల్లు కాదు"

"పాట గురించా, ఒకరు కాదు ఇద్దరు వచ్చారు"

ఇంతలో స్టీల్ ప్లాంట్ పైలాన్, ఎంట్రన్స్ దగ్గర ఆర్చ కనబడి "ఇదేమిటి అవినాష్ సీతమ్మధారలో వుంటున్నాడని చెప్పావు, మనం స్టీల్ ప్లాంట్ దగ్గర వున్నాము, అసలు మనం ఎటు వెళుతున్నాము" అని అడిగింది రాధ.

"అన్నవరం"

"మతి గాని పొయిందా మనిద్దరమూ అన్నవరం వెళ్ళడమేమిటి? ఈ విషయం మీ ఆవిడకి తెలిస్తే నన్ను హైదరాబాద్ దాకా తరిమి తరిమి కొడుతుంది, ఇంకెప్పుడు వైజాగ్‌లో అడుగుపెట్టనివ్వదు"

"థాంబా, ఈ అన్నవరం ట్రిప్ సలహా మా ఆవిడే ఇచ్చింది"

"నీ మరాఠీ మంచిగుంది బిడ్డా, కాని అబద్ధం చెబితే అతికనట్లుండాలె". కృష్ణమోహన్ వేళాకోళమాడుతున్నాడని అర్థం చేసుకొని తను కూడా తనకి వచ్చిన తెలంగాణా యాసలో సమాధానం చెప్పింది.

"నిజం" అని ఆ రోజు అవినాష్ ఇంటి నుండి తిరిగి వస్తునప్పుడు తనకి రుక్మిణి మధ్య జరిగిన సంభాషణ గురించి చెప్పాడు.

"ఓహ్ మై గాడ్ నిజంగానా, మీ ఆవిడ మంచి మనసున్న వ్యక్తి, ఉత్తమురాలు అని మాత్రమే అనుకున్నా కానీ చాలా తెలివిగలది, ఖతర్నాక్"

"మనం ఏకాంతంగా కలసుకొని మన కష్టసుఖాలు మాట్లాడుకొంటే మన మనసులలో వున్న వేదన దూరమవుతుందని మనకి సహృదయంతో ఈ అవకాశం కల్పిస్తే నువ్వు తనని ఖతర్నాక్ అంటావా?"

"నాయనా మీ ఆవిడని నేను ఏమీ అనలేదు, ఆవిడ తెలివితేటలని పొగిడాను" అని "దొంగాడి చేతికి తాళం ఇచ్చింది" అంటూ ఏడిపించింది. ఆ మాటకి ఇద్దరూ నవ్వుకున్నారు.

ఎలమంచిలి బైపాస్ రోడ్డులో ఒక ధాభా దగ్గర కారు ఆపి "ఏమిటి తిందాము?" అని అడిగాడు

"ఇంట్లో కడుపునిండా మీ రుక్మిణి చేసిన బ్రేక్‌ఫాస్ట్ తిన్నాక కనీసం మధ్యాహ్నం రెండు గంటల దాకా నాకు ఆకలి వెయ్యదు, నీకు కావాలంటే ఆర్డర్ చెయ్యి"... ఆ "మీ" అన్న పదాన్ని వత్తి పలుకుతూ అంది.

"సరే నాదీ మా రాధ పరిస్థితే, కాఫీ తాగుదాము"... ఆ "మా" అన్న పదాన్ని వత్తి పలుకుతూ అన్నాడు.

"నువ్వు ఎంత వత్తి పలికినా నేను నీ దాన్ని కానుగా?" అని బాధగా అంది రాధ. ఆమె స్వరంలో మార్పు గమనించాడు కృష్ణమోహన్.

"ఎవరు చెప్పారు నువ్వు నాదానివి కావని, అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ నువ్వు నాదానివే, నేను నీవాడినే"

"ఏమిటి మాట్లాడుతున్నావు, మనిద్దరికీ పెళ్ళిళ్ళు అయి ఎవరి జీవితం వాళ్ళు జీవిస్తున్నాము, మన పిల్లలు పెద్ద వాళ్ళయ్యారు. ఈ జన్మలో మనిద్దరమూ భార్యాభర్తలయే అదృష్టాన్ని ఆ భగవంతుడు ఇవ్వలేదు" అంటూ కన్నీరు పెట్టుకుంది అనూరాధ.

"ఏయ్ రాధా! ఏమిటిది, నిజమే ఈ జన్మలో మనం భార్యాభర్తలు కాలేకపోయాము, అది దైవ నిర్ణయం. దైవం ఏమి చేసినా మన మంచికేనని నమ్మే మనుషులం మనము, అందుకే ఆ దైవ నిర్ణయాన్ని శిరసావహిస్తున్నాము" అని కృష్ణమోహన్ ఆమెని ఓదార్చాడు.

"కృష్ణా, నాకు ఒక కోరిక వుంది ?" అంది అనూరాధ.

"ఏమిటది?"

"ఇప్పుడే ఈ క్షణమే నీతో కబుర్లు చెబుతూ ఇలా ఇక్కడే ప్రాణం వదిలేయాలని వుంది" అంది అనూరాధ.

కృష్ణమోహన్ ఉలిక్కిపడి "రాధా" అని గట్టిగా అరచి తన కుడి చేతితో

రాధ నోరు మూసాడు.
"మనిద్దరమూ ఒకటి కాలేకపోయినా, ఇరవై మూడేళ్ళు నిన్ను చూడకపోయినా, నువ్వు వున్నావని నన్ను నేను సమాధాన పరచుకుని జీవించాను" అని చాలా ఉద్వేగంతో అన్నాడు.
"ఐ యాం సారీ కృష్ణా, ఎమోషన్లో ఎదేదో మాట్లాడి నీ మనసు నొప్పించాను"
ఓకే, టైం తొమ్మిదిన్నర దాటింది, ముందు సత్యనారాయణస్వామివారి దర్శనము చేసుకొని, మళ్ళీ ఇక్కడికే వచ్చి భోజనం చేసి ఇక్కడనుండి పూడిమడక బీచ్‌కి వెళ్ళి అక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకుందాము, ఇక బయలుదేరుదాము" అన్నాడు.
అన్నవరం కొండమీదకు చేరుకొనేసరికి పదకొండు అయింది. స్వామి వారి దర్శనానికి వెళ్ళి, ఇద్దరూ తమ గోత్ర నామాల మీద అర్చన చేయించుకున్నారు. స్వామి విగ్రహాన్ని చూస్తూ తన్మయత్వంలో మునిగిపోయారు.
"రాధ జీవితంలో అంతా మంచే జరగాలి, రాధ, పిల్లలు ఇక ఎటువంటి కష్టాలు పడకుండా వాళ్ళకి మంచి ఆయురారోగ్యాలని, సంతోషాన్ని, సుఖాన్ని ప్రసాదించు స్వామి" అని కోరుకున్నాడు కృష్ణమోహన్.
"కృష్ణకి రుక్మిణి లాంటి మంచి ఉత్తమురాలిని భార్యగా ఇచ్చావు, నాకు చాలా ఆనందంగా వుంది. వాళ్ళిద్దరూ వాళ్ళ పిల్లలతో కలసి నిండు నూరేళ్ళు ఆరోగ్యవంతంగా, సంతోషంగా, సుఖంగా జీవించాలని వాళ్ళని ఆశీర్వదించు స్వామి" అని అనూరాధ కోరుకుంది.
దర్శనము చేసుకొన్న తరువాత ప్రసాదం కొనుక్కొని ఇద్దరూ కాస్త తిని మిగతాది ఇంట్లో వాళ్ళ కోసం వుంచారు. అక్కడ వున్న పంపా నదిని చూస్తూ తమ గత అన్నవరం యాత్రా విశేషాలని ముచ్చటించుకున్నారు.
"నాకు ఎప్పుడు అన్నవరం వచ్చినా ఎంతో మనశ్శాంతిగా వుంటుంది. స్వామివారి విగ్రహాన్ని ఎంతసేపు చూసినా తనివితీరదు" అన్నాడు కృష్ణమోహన్.
"అవును ఇక్కడ ఈ కొండమీద నుండి చూస్తే ఆ రెండు కొండల మధ్యనుండి ప్రవహిస్తున్న పంపానదిని చూస్తూ వుంటే ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది" అంది రాధ.
కారులో కూర్చుని బయలుదేరబోతూ వుంటే ఒక పేద బ్రాహ్మణుడు వచ్చి "అయ్యా! నేనొక వేద పండితుడిని, చితికిపోయాను, అయినవాళ్ళందరూ పోయి ఒంటరిగా జీవిస్తున్నాను, నా వయసు డెబ్బైఐదు సంవత్సరాలు, కడుపునిండా తిని మూడు రోజులయింది. కష్టపడి పని చెయ్యడానికి శక్తి లేదు, బిచ్చమెత్తుకోవడమంటే అభిమానం అడ్డువస్తున్నాది, కానీ ఈ ఆకలి చేసే విలయ తాండవం ముందు నా మానాభిమానాలు నామరూపాలు లేకుండా నలిగిపోతున్నాయి, నాకు కడుపునిండా భోజనం పెట్టిస్తారా" అని కళ్ళ వెంబడి నీళ్ళు కారుతుండగా ఏడుస్తూ ఎంతో దీనంగా అడిగాడు.
అది చూసిన కృష్ణమోహన్‌కి, రాధకి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వెంటనే ఇద్దరూ కారు దిగి ఆ బ్రాహ్మణుని చెయ్యి పట్టుకొని హోటలుకి తీసుకొని వెళ్ళి, అక్కడ మేనేజర్‌తో మాట్లాడి ఆయన తినినంతా పెట్టమని చెప్పారు.
ఆ బ్రాహ్మణునితో "అయ్యా మీరు మొహమాట పడకుండా భోజనం చెయ్యండి, నేను డబ్బు చెల్లించాను. మీరు కడుపు నిండా తిని తృప్తి చెందిన తరువాతే మేము బయలుదేరుతాము" అన్నాడు కృష్ణమోహన్.
ఆ బ్రాహ్మణుడు భోజనం చేసిన తరువాత "ఆ లక్ష్మీనారాయణులే వైకుంఠం నుండి దిగివచ్చి ఈ రోజు నా క్షుద్బాధని తీర్చారు. అయ్యా నేను ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోగలను, ఆకలితో వున్న నన్ను అదరించి నా ఆకలి తీర్చారు. మీకు శతకోటి నమస్కారాలు" అంటూ నమస్కారం చేయబోతూ వుంటే కృష్ణమోహన్ అతని చేతులు పట్టుకొని వారించి..."అయ్యా మీరు పెద్దవారు, పండితులు మీ కన్నా వయసులో ఎంతో చిన్నవాళ్ళం, మీరు మాకు అలా నమస్కరించకూడదు, మమ్మల్ని ఆశీర్వదించండి" అంటూ ఆయన చేతిలో మూడు వంద రూపాయులు పెట్టి కృష్ణమోహన్, రాధ ఆ బ్రాహ్మణుని కాళ్ళకి నమస్కరించారు.
ఆ బ్రాహ్మణుడు వారిద్దరి శిరస్సుల మీద చేయి వేసి "శతమానం భవతి శతమనంతం భవతి శతమైశ్వర్యం భవతి శతమితి శతం శతసంవత్సరం దీర్ఘమాయుః శతమానం భవతి శతాయుః పురుష శ్శతేం-

ద్రియే ఆయుష్యేవేంద్రియే ప్ర-తిష్ఠతి ఆయురారోగ్య ఐశ్వర్య-మస్తు యశోవిభవ ప్రాప్తిరస్తు"... అని ఆశీర్వచన మంత్రం చదివి ధీర్ఘాయుష్మాన్‌భవ అని కృష్ణమోహన్‌ని, దీర్ఘసుమంగళీభవ అని అనూరాధని దీవించి..."మీ పిల్లా పాపలతో, మనుమలు, ముని-మనుమలతో నిండు నూరేళ్ళా ఆయురారోగ్యాలతో సుఖసంతో-షాలతో జీవించండి"అని ఆశీర్వ-దించాడు.

"అయ్యా మేమిక వెళ్ళొస్తాము" అన్నాడు కృష్ణమోహన్.

"శుభం, వెళ్ళిరండి" అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

ఆ పేద బ్రాహ్మణుడు గురించే ఎవరికి వారు ఆలోచిస్తూ వున్నారు. కృష్ణమోహన్‌కి ఆ పండితుడి దీ-నావస్థ చూసి చాలా బాధ కలిగింది. అనూరాధకి కూడా అంతటి వేద పండితుడు ఈ రోజు బిచ్చమెత్తు-కోవడం బాధ కలిగింది. అన్నవరం నుండి బయలుదేరిన కొంతసేపు వరకు ఇద్దరూ మౌనంగా వున్నారు.

"బావా ఆయన పరిస్థితి చూస్తే చాలా బాధగా వుంది. ఈ రోజుల్లో వేద పండితులకు సరి అయిన గుర్తింపు లేకుండా పోయింది"

"నా హృదయం కలచి వేసింది"

"నువ్వు చాలా సెన్సిటివ్ అయిపో-యావు బావా"

"అవును ఈ మధ్య కాలంలో కొన్ని విషయాలు నన్ను చాలా ఆవేద-నకి గురి చేస్తున్నాయి. కొన్ని సిని-మాపాటలు వింటున్నపుడు కూడా నేను ఉద్వేగానికి గురి అవుతున్నా-ను, అలాగే చాలా విషయాలలో"

"ఎక్కువగా ఆలోచిస్తున్నావేమో"

"అయుండచ్చు"

"ఎక్కువగా ఆలోచనలు చేసి ఉద్వేగానికి గురికాకు. బావా ఒక విషయం గుర్తు పెట్టుకో 'ఉంకొక వ్యక్తి గాని, ఏదైనా సంఘటన గాని నిన్ను నియత్రించకుండా నువ్వు ఆపిన క్షణం నుండి నీకు మన-శ్శాంతి దొరుకుతుంది' "

"అలాగే, తుని వచ్చింది కూల్ డ్రింక్ తాగుదాము కాస్త రిలీఫ్‌గా వుంటుందేమో"

తుని నుండి బయలుదేరిన తరువాత "నువ్వు ప్రొద్దునన-గా లేచావు మళ్ళీ బీచ్‌కి వెళితే అవకాశం వుండదు, అందుకని ఆ సీట్ వెనక్కి వాలుస్తాను, పాటలు వింటూ కాస్సేపు రిలాక్స్ అవు. హోటల్ వచ్చాక లేపుతాను" అన్నాడు కృష్ణమోహన్.

"ఆ బ్రాహ్మణుడు మనిద్దరినీ భార్యా భర్తలు అనుకుని నన్ను దీర్ఘసు-మంగళీభవ అని దీవించాడు, మనం విషయం చెప్పి వుండవ-లసింది" అపరాధ భావంతో అంది అనూరాధ.

"ఇప్పుడే అనవసరంగా ఆలోచిం-చవద్దని నాకు సలహా ఇచ్చావు మరి నువ్వు ఏం చేస్తున్నావు? ఆయన నిష్కల్మషమైన హృదయంతో దీవించాడు. మనల్ని వైకుంఠం నుండి వచ్చిన లక్ష్మీనారాయణు-లు అన్నాడాయన, కాని ఆ సత్య-నారయణస్వామి వారి వ్రత కథలో బ్రాహ్మణుని రూపంలో వచ్చిన స్వామి వారిలా నాకు కనబడ్డాడు" అన్నాడు కృష్ణమోహన్.

స్టీరియోలో పాటలు వింటూ అనూరాధ నిద్రపోయింది, కృ-ష్ణమోహన్ పాటలు వింటూ డ్రైవ్ చేస్తున్నాడు. హోటల్ వచ్చింది, ఇద్దరూ కారు దిగి వాష్‌రూంకి వెళ్ళి ఫ్రెష్ అయి వచ్చి కూర్చున్నారు.

"ఆ రోజుల్లో ఉద్యోగం చేస్తాను అనేదానివి, ఉద్యోగం చేస్తున్నా-వా?" అడిగాడు కృష్ణమోహన్.

"పెళ్ళి అయిన తరువాత ఆయనని అడిగితే అభ్యంతరం లేదన్నా-రు, అపుడు ఒక ఎడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీలో ఆఫీస్ అసిస్టెంట్‌గా చేరాను. దాని యజమానికి మా నాన్నగారి వయసు వుంటుంది. ఆయనకి ఒక్కడే కొడుకు, అమెరి-కాలో వుంటున్నాడు, అక్కడే సెటిల్ అయాడు. మా కంపెనీ యజమాని నన్ను తన కన్న కూతురిలా చూ-సుకుంటున్నారు. ప్రకాష్ పోయి-నపుడు చాలా సపోర్టింగ్‌గా వుండి ధైర్యం చెప్పి మా నాన్నగారి కంటే ఎక్కువ జాగ్రత్తగా చూసుకున్నా-రు. ఇపుడు మేనేజర్‌గా ఎదిగాను, మొత్తం కంపెనీ బాధ్యత అంతా నా మీదే పెట్టారు. మా యజమాని వారానికి ఒకసారి లేదా రెండు రోజులు మాత్రమే ఆఫీస్‌కి వచ్చి అన్ని విషయాలూ చూసుకుం-టారు. ఏదైనా అవసరం అయితే ఫోన్లోనే గైడెన్స్ ఇస్తారు, మనది కర్ర పెత్తనమే. అందుకని ఇబ్బంది ఏమీలేదు, హాయిగా వుంది"

"వెరీగుడ్, అటువంటి మంచి మనసున్న వ్యక్తి దగ్గర ఉద్యోగం దొరకడం చాలా సంతోషంగా వుంది"

"నీ ఉద్యోగం ఎలా వుంది? ఎన్ని ప్రమోషన్స్ వచ్చాయి? ఏమైనా అవార్డ్స్ వచ్చాయా?"

(ఇంకా వుంది)

# లసతు సంస్కృతం -- జయతు భారతం



చిలకమర్తి దుర్గాప్రసాదరావు

ప్రకృతి మానవజాతికందించినటు- వంటి వరాల్లో భాష ఒకటి. మిగిలిన జంతువులకు భాష లేదా అని ఎవరైనా ప్రశ్నిస్తే ఖచ్చితంగా లేదని చెప్పలేం గాని మనకున్నంత నిర్దిష్టంగా , నిర్దు- ష్టంగా లేదని మాత్రం చెప్పగలం. ఈ భాష అనేది మనకు లేకపోతే మన పరిస్థితి ఎలా ఉండేదో మనం ఊహి- ంచుకోలేం. దండి అనే ఒక మహాకవి ఇలా అంటాడు.

ఇదమంధంతమః కృత్స్నం జాయేత భువనత్రయం .

యది శబ్దాహ్వయం జ్యోతిరాసంసారం న దీప్యతే.

అంటే మనకు భాష అనే దీపం లేకుండా ఉన్నట్లయితే ఈ మూడు లోకాలు ఏనాడో దట్టమైన చీకటిలో మునిగిపోయి ఉండేవి. దీన్నిబట్టి ఈ లోకం అంధకార బంధురం కాకుండా మనకు వెలుగు ప్రసాదించేది భాష అని తెలుస్తోంది .

ఇక ప్రపంచంలో ఎన్నో భాషలు పుట్టాయి , ఎన్నో భాషలు నశించాయి . కొన్ని జన వ్యవహారంలో ఉన్నాయి. కాని పుట్టిన నాటి నుంచి నేటివరకు మానవ జీవితాన్ని అన్ని రంగాల్లో ప్ర- భావితం చేసిన భాషల్లో సంస్కృతం ఒకటి. భాష కేవలం భావ ప్రకటన- కు ఒక సాధనం . కాని కేవలం దానికే పరిమితం కాకుండా భావప్రకటనతో బాటుగా మానవ జీవనప్రవంతిలో మమైకమై, తానూ సంస్కరింపబ- డుతు మానవజాతిని సంస్కరించి సమున్నతంగా తీర్చిదిద్దిన భాషల్లో సంస్కృతం ఒకటి. భాషలన్నీ గొప్పవే ఏదీ దేనికీ తీసిపోదు. కానీ సంస్కృతా- నికి ఒక ప్రత్యేకత ఉంది .

ఈ భాష ఒకప్పుడు మన దేశంలో జన వ్యవహారంలో ఉండేదని చెప్పడానికి ఎన్నో ఆధారాలున్నాయి. అనేక ఆర్ధిక , సాంఘిక , సామాజిక కారణాలవ- ల్ల జనవ్యవహారం నుండి తొలగిపో- యి గ్రంథాలకే పరిమితమైంది . ఈ భాషను మరల సామాన్య జన వ్యవ- హార భాషగా తీర్చిదిద్దడం కోసం ఎన్నో ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛందసంస్థలు నిర్విరామంగా కృషి చేస్తున్నాయి. విశ్వ సంస్కృత ప్రతిష్ఠానం, సంస్కృత భారతి , U.G.C వంటి సంస్థల ద్వారా ఎందరో ఋషితుల్యులైన మహాను భావులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు.

ఇక భాషకు రెండు పార్శ్వాలుం టాయి. ఒకటి వ్యవహారం, రెండు సాహిత్య సంపద. సంస్కృతభాషలో పుష్కలమైన సాహిత్య సంపద ఉంది. వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు, ధర్మశాస్త్రాలు దర్శనాలు. సమస్త కళలకు సంబంధించిన వేలాది గ్రంథాలు వేలాది వ్యాఖ్యలతో మనకు లభిస్తున్నాయి.

శాస్త్రీయమైన వ్యుత్పత్తిజ్ఞానం ఈ భాషకొక ప్రత్యేకత. ఉదాహరణ- కి చెట్టుని మనం ఆంగ్లంలో tree అంటాం. ఆ పేరు దానికెలా వచ్చిందో మనకు తెలీదు. కాని సంస్కృతంలో చెట్టుని పాదపం అంటారు . పాదైః అంటే పాదాలతో పిబతి త్రాగుతుంది కాబట్టి పాదపః అంటే చెట్టు.

అలాగే ద్విపం అంటే ఏనుగు . ద్వాభ్యాం రెం డిటితో పిబతి త్రాగు- తుంది కాబట్టి ఏనుగును ద్విపం అంటాం . అది తొండంతో నీరు త్రాగి అది నోట్లో పోసుకుని మళ్ళా త్రాగు- తుంది. ఈ వివరణ elephant అనే పదంలో ఉంటుందని నేననుకో- ను. అలాగే ఉరసా గచ్ఛతీతి ఉరగః అంటే పొట్టతో నడిచేది కాబట్టి పాము ఉరగం అయ్యింది. అలాగే పాదై : న గచ్ఛతి ఇతి పన్నగః పాదాలతో నడువ- నిది కాబట్టి పన్నగం అయ్యింది .

(సశేషము)

# శ్రీ ప్లవ నామ సంవత్సరానికి (2021-22) ఆహ్వానం

మత్స్యరాజ హరగోపాల్



కాలానికి కొలమానం సంవత్సరం.
కా : అనగా శుభమును
ల : అందించునది.

తెలుగు సంవత్సరాలు అరవై (60)
ప్రభవ : మొదటిది, అక్షయ : చివరిది ` రాబోయేది 'ప్లవ' నామ సంవత్సరమ్.
'శార్వరీ' (గత ఉగాది) 34వ సంవత్సరము.
'శార్వరీ' అంటే రాత్రి.
లక్ష్మీదేవి నామాల్లో ఒకటి 'శార్వరీ'.
మన ఆయుర్దాయము వంద (100) సంవత్సరాలు.
'అందుకే శతమానం భవతి'అంటారు.
సంవత్సరంలో ఋతువులు ఆరు (6)
1. వసంతము (Spring), 2 గ్రీష్మము, 3. వర్ష (Rain), 4. శరత్, 5. హేమంతం, 6. శిశిరం
తెలుగుమాసాలు (నెలలు) 12. మొదటిది చైత్రం. పౌర్ణమి (Full Moon), చిత్తా నక్షత్రముతో కూడిన మాసం చైత్రం.

సూర్యుడు మేషరాశిలో ఉంటాడు. వసంత ఋతువు, చైత్రమాసం (Month) శుక్లపక్షం, పాడ్యమీ తిథిరోజు వచ్చేది ఉగాది.
ఈ సంవత్సరం (2021)లో 13 ఏప్రిల్ మంగళవారం రోజున 'ప్లవ' నామ సంవత్సరం ప్రారంభం అవుతుంది.
ఉ : ఉత్తమమైన
గా(గం) : జ్ఞానం (knowledge)
'ఆది యందు గది, ఉగాది.
సరైన జీవన విధానానికి (Life Style) ఉపకరించే విద్యను నేర్చుకోవడానికి ప్రారంభమైన దినమే ఉగాది.

శాస్త్రప్రకారం చైత్రశుద్ధ పాడ్యమి తిథి రోజు ఉగాది ఉత్సవ (పండుగ) జరుపుకోవాలి.

వసంత ఋతువు ప్రాశస్త్యమైంది. 'ఋతునామ్ కుసుమాకర...'` అన్ని ఋతువులో నేను వసంత ఋతువును(శ్రేష్ఠ ఋతువును!)' అంటాడు శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో. పంచ భూతమైన ప్రకృతి వసంత ఋతువులో పులకరిస్తుంది. మోడువారిన చెట్లు చిగురిస్తాయి. కోయిలలు తమ మధురగానాన్ని స్వరాన్ని వినిపిస్తాయి. ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మన జీవితాలు ప్రకృతిలో ముడివడినటువంటివి.

### ఉగాది పచ్చడి సేవనం

మానవ జీవనంలోని సుఖ`సంతోషాలు, దుఃఖాలు, కష్టాలు అన్నీ ఉగాది పచ్చడికి ప్రతీకలు.
పచ్చడిలో
1. వేపపువ్వు (చేదు), 2. మామిడి (వగరు), 3. కొత్తచింతపండు (పులుపు), 4. మిరియాలపొడి (కారం), 5. మిరప, 6. సైంధవ లవణం (ఉప్పు) ఉండాలి. ఆయుర్వేద రీత్యా వీటికి కఫ, వాత, పిత్త దోషాలను తొగించే లక్షణములున్నాయి. అందువల్ల మన తెలుగు ఉగాది రోజు ఉగాది పచ్చడి సేవనం ముఖ్యమైనది.

### పంచాంగ శ్రవణం

మన సనాతన హైందవ ధర్మంలో కాలానికి కొలమానం సంవత్సరం. అయితే మానవ జీవనంపై నవగ్రహాల ప్రభావం ఉంటుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

### పంచాంగం

పంచ : అయిదు, అంగాలు ` - భాగాలు.
అవి. 1. అధి, 2. వారము, 3. నక్షత్రము, 4. యోగము, 5. కరణము.
పంచాంగ శ్రవణం ద్వారా 'ప్లవ' నామ సంవత్సరంలో రాబోయే పరిస్థితులను, భవిష్యత్‌వాణి ద్వారా తెలుసుకోవచ్చు. ఈ సంవత్సరంలో మనము మంచి కార్యాచరణ, నడవడి ద్వారా మన కర్తవ్యాన్ని ధర్మాన్ని నెరవేర్చాలని సనాతన ధర్మప్రబోధం.
ఈనాడు మన హిందూ యువతరం తెలుగు పండుగకు దూరమయినట్లుగా కనిపిస్తుంది - మన దేశంలో, విదేశాల్లోనూ. అయితే మూలం (Roots) బలంగా ఉంటేనే చెట్టు బలంగా ఉంటుంది. మన ధర్మంలో ఒక్కో పండుగకు ప్రత్యేకత, విశిష్ఠత ఉంది. విదేశాల్లో ఉంటున్న మనవారికి మన సంస్కృతీ, సాంప్రదాయాలను, కట్టుబాట్లను సనాతన ధర్మ ప్రాశస్త్యాన్ని తద్వారా మన జీవితాల్లో భాగాలైన 'ఉగాది' లాంటి పండుగ విశిష్ఠతను మన యువతకు తెలుపుదాం. తద్వారా 'వసుధైవ కుటుంబకమ్'.
'సర్వేజనాః సుఖినో భవంతు'' అన్న మన ధర్మాన్ని ప్రపంచం నలు దిక్కులా చాటుదాం.

ఆచార్య మత్స్యరాజ హరగోపాల్
hargopal48@gmail.com

# అమృతం కన్నఅమ్మ పాలు మిన్న

డా .ఎస్. కృష్ణమూర్తి శాస్త్రి ఎం.డి. (హోమియో )

చంటి పిల్లలకు చను పాలు అమృతానికి తీసిపోనివి. ఒక రకంగా అమృతం కన్నా మించినవి. ఒక ప్రాణాన్ని కాపాడగలిగితే అమృతం, ఒక ప్రాణికి కావలసిన ఆరోగ్యం, ఆనందం, ఆప్యాయత, హాయి కలగజేస్తుంది.

ప్రకృతిలో అమ్మ గర్భంలో జీవం పోసుకున్న మరు క్షణం నుండి గర్భస్థ శిశువు ఎదుగుదలకు, ఆరోగ్యానికి ఒక రకమైన వ్యవస్థ. ఏర్పాడుతుంది. నవ మాసాలు అమ్మ రక్తం నుండి నేరుగా ఆహారం సంపాదించుకున్న గర్భస్థ శిశువు ప్రశస్తమైన తరువాత కూడా చనుపాల రూపంలో చంటి బిడ్డకు తన రక్తాన్ని పాలగా పంచుతూ అమ్మగా నిలిచి పోతుంది.

అమ్మ పాల విశిష్టత గురించి కొంత అవగాహన పెంచుకుందాం. మన పైన చెప్పుకున్నాం అమ్మ లోని శరీర వ్యవస్థ తన శిశువుకు తగ్గట్టుగా తయారవుతుంది, అంటే శిశువుకు ఎటువంటి పాలతో ఆరోగ్యం కాపాడబడుతుందో, ఏ పాళ్ళలో పోషక పదార్థాలు ఉండాలో, ఆప్యాయత ఉండాలో, ఆరోగ్యం ఉండాలో, ఆనందం ఉండాలో ఆ ఆ పాళ్ళలో అమ్మ పాలు తయారవుతూ ఉంటాయి. అమ్మ జన్యువులు, శిశువు జన్యువులకు సరిపడ్డట్టు తయారవుతూ ఉంటాయి. ఇంతగొప్ప పాలు ఎక్కడ దొరుకుతాయి? ఒకటిన్నర సంవత్సరము నుండి రెండు సంవత్సరాల దాకా పాలు ఇవ్వ గల సామర్థ్యం అమ్మకి ఉంటుంది. శిశువు జన్మించిన అర గంట లోనే పాలు రావడం మొదలవుతాయి. ఆ పాల వలన వ్యాధి నిరోధకశక్తిని పెంచడానికి ఎంతగానో ఉపయోగ పడుతుంది.

1. అమ్మ పాలల్లో ఆహార పోషక పదార్థాలు మెండుగా ఉండి శిశువుకు పుష్టిని ఇవ్వగలవు.
2. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.
3. శిశువు ఎదుగుదలకు దోహద పడుతుంది.
4. కలుషితం కానివి అమ్మ పాలు.
5. ఎప్పుడంటే అప్పుడు ఎక్కడంటే అక్కడ ఇవ్వ గలిగిన పాలు అమ్మ పాలు.
6. మెదడు ఎదగడానికి ఉపయోగపడుతుంది. తెలివి తేటలు పెరుగుతాయి.
7. శిశువుకు అవసరమైన వరకే పోషకాలు ఉండడంతో ఊబకాయం రాదు.
8. శిశువులో తెల్ల కణాలు సరి అయిన నిష్పత్తిలో ఉంటాయి.
9. దీర్ఘవ్యాధులు రాకుండా కాపాడుతుంది. ఉబ్బసం, చర్మ వ్యాధులు, అలర్జీ మొదలైన జబ్బులు తల్లి పాలు తాగేవారిలో రావు.
10. విటమిన్ A ఎక్కువగా ఉండడంతో ఎలర్జీ, వైరస్, ఇన్ఫెక్షన్స్ వంటి జబ్బులు రావు.
11. చిన్న ప్రేగులలో ఎలర్జీ రాకుండా కాపాడుతుంది.
12. చిన్న ప్రేగులలో త్వరగా కాలేయం వ్యాధి రాకుండా కాపాడుతుంది.
13. తల్లి పాలు బిడ్డకు ఎంత ఉష్ణోగ్రతలో కావాలో అంత అమ్మ ఉష్ణోగ్రతలోనూ దొరుకుతాయి.
14. అమ్మ స్పర్శ, అమ్మ చను స్పర్శ, అమ్మ చేతి స్పర్శ, అమ్మ ఒడి బిడ్డకు కొండంత బలం అండ ఇస్తుంది.

ఇక అమ్మ విషయానికి వస్తే :

1. అమ్మకు ఆనందాన్నిస్తుంది.
2. అమ్మలో రక్త లేమి లేకుండా చేస్తుంది.
3. స్థనంలో గడ్డలు రాకుండా చేస్తుంది.

(ఇంకా వుంది)

# నవవిధ భక్తులు

## అర్చనం

ఆదూరి హైమవతి



**నవవిధ భక్తిమార్గాలు అర్చనం**

"బామ్మా! నవవిధ భక్తిమార్గాల్లో ఐదవదాన్ని గురించి చెప్తావా?" అంటూ బామ్మ దగ్గరకొచ్చి కూర్చుంది కుమారి.

"తప్పక చెప్తాను కుమారి! అసలు అర్చనం అంటే భగవంతుని పటానికో, ఆలయాల్లో ఐతే విగ్రహాలకో అష్టొత్తరశతనామాలతో పూజించడం.అర్పించడం అంటే సమర్పించడం అని అర్థం. మనకున్న వాటిని భగవంతుడికి సమర్పించడమే అర్చన. అసలు మనకు ఏదైనా భగవదనుగ్రహం వల్లే కదా వస్తుంది? మరి మనం ఆయన మనకిచ్చినదాన్ని తిరిగి ఆయనకు సమర్పించడమంటే అర్థమే ఉండదు.మరి మనం ఆయనకు ఏమివ్వాలీ అంటే మనలోని దుర్గుణాలు భగవంతునికి సమర్పించి, పరిపూర్ణమైన ప్రేమను పెంచుకుని, మనతోటి వారికి సాయం చేయడం ఆయనకు ఇష్టమైన అర్చన. నీకు బాగా అర్థంకాను ఒక కథ చెప్తాను విను.

పూర్వం ఒక చిన్నపాటి నగరంలోపుల్లయ్య, పోలయ్య అనే ఇరువురు పండ్ల వ్యాపారులు ఉండేవారు. పోలయ్య మంచి వ్యాపారదక్షత గల వాడు. ఎలా తన వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలో నిత్యం ఆలోచిస్తూ ఉండేవాడు.

పుల్లయ్య సాదాసీదా వ్యక్తి. తనవ్యాపారంతో పాటుగా తనచుట్టూ సమాజంలో ఉండే తనకంటే పేదలనూ, అనాథలనూ గురించి ఆలోచిస్తూ, వారికి చేతనైన సాయం చేస్తూ ఉండేవాడు. ఉండనూ తిననూ ఉంటే చాలని అతని అభిప్రాయం. పోలయ్య రోజూ తన అంగడికి వెళ్లేదార్లో ఉన్న వినాయక స్వామి ఆలయానికి వెళ్ళి రెండు పండ్లు సమర్పించుకుని అర్చన చేయించుకుని, ప్రసాదంగా ఇచ్చిన ఒక పండును అక్కడే తినేసి షాపు కెళ్ళేవాడు.



పుల్లయ్య రోజు తన అంగడికెళ్లేముందు కొన్ని పళ్ళను ఒక బుట్టలో తెచ్చుకుని వినాయకస్వామి ఆలయం ముందుండే బిచ్చగాళ్ళకూ, అనాథలకూ, అవిటి వారికి ఇచ్చి బయటి నుండే వినాయక స్వామికి నమస్కరించుకుని వెళ్ళేవాడు. దూరంగా ఆలయ ద్వారం బయట ఎదురుగా నిలుచుని నమస్కరించుకుంటున్న పుల్లయ్యను లోపలి పూజారి చేయెత్తి దీవించేవాడు.

వినాయక స్వామికి రోజూ అర్చన చేయటంవల్లో, మరే అదృష్టంవల్లో పోలయ్య వ్యాపారం బాగా అభివృద్ధి ఐంది. లాభాలతో మంచి ఇల్లు కూడా కట్టుకున్నాడు. పుల్లయ్య వ్యాపారం సాగుతున్నది కానీ పెద్దగా లాభాలూ లేవు, నష్టాలూ లేవు, సాదాసీదాగానే సాగుతున్నది.

దార్లో వచ్చేవారంతా వెళుతున్న పుల్లయ్యకు నమస్కరించడం, గుడిముందున్న బిచ్చగాళ్ళంతా పుల్లయ్య కనిపించగానే నవ్వుతూ లేచి దణ్ణంపెట్టడం చూసిన పోలయ్య అసూయతో మండిపోసాగాడు.

పుల్లయ్య ఏనాడూ ఆలయం లోపలకు వెళ్లనే లేదు. బయటినుంచే నమస్కరించుకునేవాడు.

ఒకరోజున ఆలయంలో పూజకై వెళ్ళిన పిచ్చయ్య, బయటనుంచీ నమస్కరించుకుంటున్న పుల్లయ్యను లోపలినుంచీ దీవిస్తున్న పూజారిని చూసి ఆశ్చర్యపడి" పూజారిగారూ! ఏనాడూ గుడి లోపలికొచ్చి ఒక్క పండైనా సమర్పించి అర్చన చేయించని పిచ్చి పుల్లయ్యను మీరు ఇక్కడి నుంచే దీవించడం నాకు ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు.

దానికి పూజారి "ఏమీ అనుకోకండి పోలయ్య గారూ! మీరు



రోజూ రెండు పళ్ళుతెచ్చి స్వామికి సమర్పించి, మీ వ్యాపారం బాగా సాగాలని అర్చన చేయించుకుని ఆ రెండు పళ్లలో ఒకటి ప్రసాదంగా తిరిగి మీకు ఇస్తే ఇక్కడే తినేసి వెళుతున్నారు. మీ అర్చన మీ వ్యాపారాభివృద్ధికోసం. మీరన్నట్లు ఆ పిచ్చి పుల్లయ్యగారు బయటి అనాధలందరిలో వినాయక స్వామిని చూస్తూ వారి ఆకలి తీర్చి అక్కడినుండే స్వామికి నమస్కరించుకుంటున్నాడు. వారందరిలోని వినాయక స్వామినీ అర్చించుకుంటున్నాడు. మీరు ఒక్క వినాయక స్వామిని అర్చిస్తే, పుల్లయ్యగారు ఎంతోమంది వినాయకస్వాములను అర్చిస్తున్నాడు. అర్చన అంటే స్వార్ధంకోసం భగవంతుని పూజించడం కాదండీ! భగవంతుని సృష్టిలోని అనాధలకు సాయం చేయడం" అని చెప్పి హారతి పళ్ళెంతో లోపలికెళ్లాడు.

పూజారి మాటలు పోలయ్య కళ్ళు తెరిపించాయి. పుల్లయ్య గొప్పదనం అర్థమైంది. ఆరోజునుంచీ తాను కూడా కొన్ని పళ్ళు తెచ్చి బిచ్చగాళ్ళకూ, పేదలకూ అనాథ వృద్ధులకూ ఇవ్వసాగాడు. నిజమైన అర్చన అంటే స్వార్థ రహితంగా చేసే మానవసేవే కుమారి!" అంటూ ముగించింది బామ్మ .


****

## మార్చి 2021 నెల గడి- నుడి సమాధానాలు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| త్రి | కో | ణం | ■ | మృ | త్తి | క |
| భు | డి | ■ | గం | ■ | క | లి |
| జం | ■ | ము | గ | బో | ■ | మూ |
| ■ | ని | జ | ■ | సా | లె | ■ |
| ఫో | ■ | నై | లా | న్ | ■ | ప్ర |
| టా | టా | ■ | ఠీ | ■ | డ్డి | వ |
| న్ | టా | ప్రో | ■ | వి | వ | క్త |

# మా ఊరి నందుల ఆత్మీయ

నందుల ప్రభాకర శాస్త్రి



(గత సంచిక తరువాయి)

## రాజకీయ నాయకులు

ఎన్నికల ప్రచారం హోరాహోరీగా జరిగే రోజుల్లో ఓసారి వాళ్ళ ఊరినుండి మనిషి వచ్చారట. విషయమేమిటంటే, చిదానంద మయ్య వారి గడ్డివామిని అమ్మారు. కొన్నవాళ్ళు లారీలతో వరిగడ్డిని వారం రోజులు తరలించారు. ఓ పెద్ద కొండంత వుండేదట వామి. వారి గడ్డి తరలించటం అయిన తర్వాత అందులో మిగిలిపోయిన వడ్లగింజలన్నీ రాలాయట. అవన్నీ కుప్ప వేస్తే పది పుట్ల వరకూ వడ్లు అయ్యాయట. వారి గడ్డి కొన్నవాడు 'వడ్లు మావి' అని, చిదానందమయ్య మనుషులు 'గడ్డి అమ్మటం జరిగింది... గింజలు కాదుకదా' అని గొడవ పెట్టుకున్నారు.

ఆ వివాదాన్ని తీసుకుని చివరిమాట కొరకు ఊరినుండి మనిషి వచ్చాడు. విషయం చెప్పాడు. సావధానంగా విని... "ఒరే ... మనం ఒక ఆవును అమ్మివేశాం. అది అమ్మేటప్పుడు అది 'సూటి' పశువు, దాని కడుపులో దూడ వుంది అని తెలియదు. అమ్మిన తరువాత తెలిస్తే... దూడ మనది అంటామా?" అని తీర్పు చెప్పాడు. విన్నవాళ్ళు ఆశ్చర్యపోయారు. గడ్డి ఖరీదు కంటే వడ్ల ఖరీదే ఎక్కువగా వుంది. అది... ఆనాటి రాజకీయనాయకుల లక్షణం.

## ఉపసంహరణ

ఆధునికత అప్పుడప్పుడే ప్రారంభమవ్వడం, హరిత విప్లవ పోకడలతో ఎకరాకు నలభై నుండి యాభై బస్తాలైనా పండించాలని 'ఎవరికీ యమునా తీరే' అవటం, నిండు సంసారాలు నిట్టనిలువునా చీలిపోవటం జరిగింది. భూమి తల్లిని ప్రేమించే రైతు భూసారాన్ని లాగి ఒకేసారి పచ్చనోట్లకు పడగలెత్తాలని చూశాడు. ఎద్దులు, దున్నలు సేద్యానికి పనికిరావని యంత్రాలను మారిగాడు. మైళ్లకొద్దీ కాలినడకన, ఎద్దుల బండిపై ప్రయాణించే రైతులు మోటారు సైకిళ్ళు మరిగారు. సాయంత్రం రచ్చబండ మీద కబుర్లాడుకుంటూ పంటపొలాల దిగుబడి గురించి చీడ పురుగుల నివారణ గురించి మాట్లాడుకునే రైతు, సాయంకాలం అయ్యేటప్పటికి పక్కనున్న పట్నం వెళ్లి ఓ సినిమా చూసి, పెగ్గు బిగించి ఉదయానికల్లా ఎరువులతో, పురుగుమందులతో ఇంటికి చేరటంప్రారంభమయింది.

చూస్తూ చూస్తూ ఉండగానే కాలం 'పదేళ్లలో వందేళ్లు' ముందుకు పోయింది. మనుషుల్లో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎవరి పరిధిలో వాళ్ళు గిరి గీసుకుని బ్రతకటం మొదలుపెట్టారు. ఉమ్మడి కుటుంబాలన్నీ విచ్ఛిన్నమయ్యాయి. పెద్దరికం మంట కలిసింది. ఎవరికీ వారే పెద్ద.

చిన్న, సన్నకారు రైతుల్లో చాలామంది వడ్డీలకు డబ్బు తెచ్చుకునేవారు. పెళ్లిళ్లకు, అత్యవసరాలకు రాయిపెద్ది వెంకటరామయ్య గారి వద్ద వడ్డీకి



తెచ్చుకునేవారు. సంవత్సరం మధ్యలో తిండిగింజలు అవసరమైతే కొండువారపల్లెలో దిండుకుర్తి పీరయ్య దగ్గర 'నాగు'కు గింజలు తెచ్చుకుంటారు. 'నాగు' అంటే బస్తా గింజలు ఇస్తే బస్తాన్నర గింజలు పంట పండిన తర్వాత ఇవ్వాలి. ఇచ్చేటప్పుడు ఎక్కువగా 'వడ్లు' ఇచ్చి తీసుకునేటప్పుడు 'రాగులు' తీసుకునేవాడు దిండుకుర్తి పీరయ్య.

సంవత్సరం పొడవునా అప్పులు ఇవ్వటం, పంటమాసూలు జరిగేటప్పుడు ఊరూరా తిరిగి కళ్లంలో గింజలు తనే కొలుచుకుని బస్తాలకెత్తితే ... ఊరివాళ్ళే ఆ బస్తాలను కొండువారిపల్లె చేర్చాలి. ఈ గింజలన్నీ ఒక పెద్ద గదిలో నింపుతారు. ఆ గడిగోడలకు ఎక్కడా కిటికీలు, వాకిళ్లు ఉండవు. అడుగున ఒక చెయ్యి పట్టేటట్లు రంధ్రం ఉంటుంది. ఆ రంధ్రంలో నుండి కొంచెం గింజలు బయటకి లాగి కొలుస్తుంటాడు.

చాలామంది రైతులు చాలా సంవత్సరాలు కల్లంలో గింజలన్నీ 'నాగు తెచ్చుకున్నదానికి యివ్వగా వట్టి చేతులతో తిరిగివచ్చిన రోజులున్నాయి. అందులో మా పెద్దనాయన ప్రథముడు.

కులవృత్తులవాళ్ళు చాలామంది ఊరు విడిచిపెట్టడం, బయటి పనులు నేర్చుకోవటం జరిగింది. నాయీ బ్రాహ్మణులు చాలామంది కళాకారులుగా తయారై 'ఆల్ ఇండియా రేడియో' లో సంగీతం వినిపించే స్థాయికి చేరుకున్నారు. మరి కొంతమంది దగ్గరలో వున్న పోరుమామిళ్ళ, కలసపాడు, గుడిపాడు లాంటి చిన్న చిన్న పట్టణాలకు వలస వెళ్లి అక్కడ 'హెయిర్ కటింగ్ సెలూన్' లు పెట్టుకున్నారు. ముసలి, ముతక మాత్రం ఇక్కడే మిగిలిపోయారు.


సాయిబుల కుటుంబాలలో చాలామంది 'ఓనిపెంట' చేరుకొని పాత్రలకు 'మాట్లు' వేసే వ్యాపారంతో దేశమంతా తిరగటం, డబ్బు సంపాదించటం మొదలుపెట్టారు. 'మాట్లు' వేయడమంటే ఇత్తడి సామాన్లు బొక్కలు పడి కారుతూ ఉంటే వాటిని కారకుండా అతుకువేసే పని. ఒక్కోసారి ... ఒక్కో ఊరిలో వందలకొద్దీ ఇత్తడి గిన్నెలు, చెంబులు, బిందెలు, గంగాళాలు, వంటపాత్రలు సేకరించి రాత్రికి రాత్రే ఊరు వదిలి వెళ్లిపోవడం... మా పెద్దన్న గంపలగూడెంలో నాగార్జునసాగర్ పనుల్లో ఇంజనీరుగా చేస్తుండేవాడు. అక్కడికి మేము వేసవి సెలవులకు వెళ్ళినపుడు ఓ వ్యాపారస్తుడు అన్నమాటలివి. 'ఓనిపెంట' సాయిబులను నమ్మకూడదు అని. కానీ అందరు అలా లేరు.

(ఇంకా వుంది)



# కోవిడ్ - 19 వాక్సిన్

కోవిడ్ వాక్సిన్ పై డా. విజయ్ కోరిమిల్లి, (హ్యూస్టన్, యు ఎస్ ఎ) గారి విశ్లేషణ వీక్షించండి.



# మంగళం

నైనిక మరియు రివాన్ లు ఆలపించిన గీతాలు వినండి, వీక్షించండి.



# ప్లవనామ ఉగాదికి ఆహ్వానం

ఉగాది ప్రాశస్త్యాన్ని వివరిస్తూ శ్రీమతి శ్రీదేవి గారు ఆలపించిన పాట వీడియోలో వీక్షించండి.




# లింగాష్టకం

రేయాంష్ మరియు రిషిక్ వాయిద్యాలపై వినిపించిన లింగాష్టకం వినండి, వీక్షించండి



# శ్రీ వచన భూషణం



శ్రీ వేంకటాచార్యులు

(గత సంచిక తరువాయి)

వేదములు జ్ఞాన విజ్ఞానములను అందిస్తూ సమాజంలో మానవుల సత్ ప్రవర్తనే సమ సమాజ స్థాపనకు కారణమౌతుందని పెద్దలు తెలియజేస్తారు. అట్టి వేదాలను శ్రీమన్నారాయణుడు తన నాభి కమలమునుండి బ్రహ్మను సృజించి వేదాలు అందించి జీవ సృష్టితో పాటు వేదవ్యాప్తికి కృషి చేయమని ఆదేశించాడు. ప్రజల జీవన విధానానికి వేదం మరింత చేరువ కావాలని వాల్మీకి, వ్యాసుని వంటి అవతారాల ద్వారా రామాయణ, భారత్, భాగవత గ్రంథాలు, పురాణాలు, ఉపపురాణాల ద్వారా వేదసారము అందరికీ తెలియాలని అనేక వ్యాఖ్యానాలు అందించాడు. వైకుంఠంలోని నిత్యా సూతుల గోష్టి లోని సభ్యులను శ్రీమన్నారాయణుడు భూమిపై అవతరింపజేసి ఈ భూమిపై వాడుకలోనున్న అన్ని వ్యవహారిక భాషలలో వేదసారాన్ని తర్జుమా చేయించి అందించుట చాలావరకు జరిగింది. ముఖ్యంగా ద్రవిడ భాషలో ఆళ్వారాచార్యులుగా అవతరించి వేదసారాన్ని నాలాయిర దివ్య ప్రబంధాలుగా అందిస్తే వాటిని మరింత విస్తారంగా, మంత్రం సారములుగా అనేక పాశురాలలో మరింత విస్తరించి వ్యాఖ్యానములు అందించుట జరిగింది. అట్టివారిలో పిళ్ళైలోవాచార్య స్వామివారు ఒకరు. వీరు వడక్కు తిరువీధి పిళ్ళై గారి కుమారులు. వీరి స్వస్థలం ముడుంబై అనే నగరం. అయితే వీరు బాల్యంలోనే శ్రీరంగం వచ్చి, అక్కడే స్థిరనివాసం ఏర్పరచుకున్నారు.



భగవద్రామానుజుల తదుపరి ఆచార్య పీఠాన్ని వరుసగా ఎంబార్, పరాశర భట్టార్, నంబేయర్ తదుపరి నంబిళ్ళై స్వీకరించారు. నంబిళ్ళై గారిని వడక్కు తిరువీధి పిళ్ళై ఆచార్యులుగా భావించి తన కుటుంబ సభ్యులను కూడా మరచి ఆచార్యసేవలో గడిపేస్తున్నారు.

వీరిది బాల్యవివాహం. భార్య యుక్త వయస్కురాలై కాపురానికి తన ఇంటికి వచ్చి చేరిందని తల్లి అనేక మార్లు కబురంపినా గృహస్థు ధర్మం పట్ల అంతగా ఆసక్తి లేక ఇంటికి రాకుండా ఆచార్య సేవలోనే ఉంటున్నారు.

(ఇంకా వుంది)



CHAMPIONS BOOK OF WORLD RECORDS

Where Performance Records

# CHAMPIONS Book of WORLD RECORDS

## Certificate

### FIRST WOMAN OWNER, PUBLISHER & EDITOR OF A MAGAZINE

| | |
|---|---|
| *Name of the Record Holder* | SHANTI TEEGAVARAPU |
| *Date of Birth* | 15th January, 1955 |
| *Place of Residence* | Hyderabad, Telangana, India |
| *Area of Expertise* | Literature & Publication |
| *Details of Record* | The record for being the first Woman Owner, Publisher & Editor of a magazine with matchless contribution running for the last 10 years uninterrupted as was confirmed on 12th April, 2021. |
| *Nature of Record* | World Record |

*Your outstanding work speaks volumes of your amazing aptitudes.*
*Your commendable record is being placed in our book of records.*

*Date of Issue: 12th April, 2021*

Dr.Pattabhi Ram.Turlapati
Registrar of Records
Champions Book Of World Records

ICCE

www.championsbookofworldrecords.com

www.championsbookofworldrecords@gmail.com

• This Certificate must not be reproduced with out written permission of Champions Book of World Records

DO SOMETHING
GREAT



Where Performance Records

CHAMPIONS Book of WORLD RECORDS

Certificate

FIRST EVER VIDEO MAGAZINE

| | |
|---|---|
| Name of the Record Holder | CHAITANYAM SANKALPABALAM |
| Year of Establishment | 11th November, 2011 |
| Place of Residence | Hyderabad, Telangana, India |
| Area of Expertise | Literature & Publication |
| Details of Record | The record for bringing out Unique Video Magazine (first of its kind) with the contributions of 33 Writers as was confirmed on 12th April, 2021. |
| Nature of Record | World Record |

Your outstanding work speaks volumes of your amazing aptitudes.
Your commendable record is being placed in our book of records.


Date of Issue: 12th April, 2021

Dr.Pattabhi Ram.Turlapati
Registrar of Records
Champions Book Of World Records



# వైజ్ఞానిక పద బంధ కేళి

చాగంటి కృష్ణకుమారి



## సూచనలు: నిలువు:

1. Francis Crick and Maurice Wilkins తో కలసి ఈ అణు జీవశాత్రవేత్త DNA నిర్మాణాన్ని ప్రతి-పాదించినందుకు నోబెల్ ను అందుకున్నాడు (5)
2.స్థి ర పీడనం వద్ద నియమిత ద్రవ్యరాశి గల వాయువు ఘన పరిమాణం దాని పరమ ఉష్ణో గ్రతకు అనులోమాను పాతం వుంటుంది .. ఈ నియమం పేరు ( 3)
3. హేలొజన్ కుటుంబంలో రెండవది (3)
4. --- సర్ప భ్రాంతి (2)
5. దీనిలో క్లోరిన్ ఆక్సీకరణస్థితి+5. ఇది శుద్ధమైన క్లోరస్ ఆమ్లము అస్థిరమవటం చేత రెండుగా విడిపోవటంవల్ల ఏర్పడే ఇనార్గానిక్ ఆమ్లం పేరు. (కిందనుండి పైకి) (3)
6. అమెరికన్ బ్రాండ్ నేమ్ తో పిలువబడుతు-న్న ద్రవ రూపం లో నున్న క్రిమి సంహారిణి. మన ఇళ్లల్లోనూ ఆసుపత్రులలోనూ దినిని నీటికి కలిపి నేలను శుభ్రపరచడానికి వాడుతాము.(కిందనుండి పైకి) (3).
9. w=J Q. ఈ సమీకరణంలో J ఉష్ణ యాంత్రిక తుల్యాంకం . దీనినే జౌల్ స్థిరాంకం అని కూడా అంటాం . ఈ నియమం పేరు .(కిందనుండి పైకి) ( 5)
11. త్రాసు .(కిందనుండి పైకి)( ( 2)
12. పాలలో వుండే చక్కెర పేరు (3)
13. బెంజీన్ అణు నిర్మాణాన్ని ఈయన కలగని కనుగొన్నాడు . .(కిందనుండి పైకి (3)

## సూచనలు: అడ్డము:

1.న్యూట్రాన్ కణాన్ని కనుగొన్న శాస్త్రవేత్త( 5)
3. ట్రై క్లోరో ఎ సిటాల్డీహైడ్ C2H3Cl3O2 , దీని హైడ్రేట్ ని అదివరలో మత్తుమందుగా ఉపశమనానికై వాడేవారు
5. బలహీన మైన ఇనార్గానిక్ ఆమ్లము పేరు. దీనిలో క్లోరిన్ ఆక్సీకరణస్థితి +3 ( అటునించి ఇటు(3)
6. ఇది ఎమినో ఆమ్లము. ఫార్ముల C6H14N2O2 మన శరీరంలో మాంసకృత్తులు తయారవడానికి ఇది అవసరం. (3)
7. ఓ కవి గారి సీసపద్యంలో సముద్రం (1)
8. తృతీయా విభక్తి ప్రత్యయాలలో ఇది ఒకటి . అటునుం-చిటు (3)
9. చిలకడం . అటునించి ఇటు(3)
10. తీకాతాత్పర్యాలను వత్తు పెట్టి వ్రాయమన్నానుగా (1)
12. మనకి పాలు అరగడానికి ఈ ఎంజైమ్ తప్పనిసరి. శరీరంలోని జీర్ణ వ్యవస్థ లో దీని ఉత్పత్తి తక్కువగావుంటే పాలు అరగవు (3)
13. కరములే (3)
14.మాల్టో జ్ గ్లూకోజ్ గా మారే చర్యకి ఉ త్ప్రే రకంగా పనిచేసే ఎంజైమ్. ఉదాహరణకి ఇది ఈ స్ట్ లో వుంటుంది ( 3)
15. జౌల్ థామ్సన్ ప్రభావము( Joule Thomson effect) కి ఈ పేరు కూడావుంది. (5)

# అసలు సిసలు కవిత్వానికి ఆనవాలు

# పెన్నా పెన్నుజాలు





తుమ్మూరి రాం మోహనరావు

మొదటి సారి పెన్నా శివరామకృష్ణ గారి పేరు ముప్పై ఏళ్ల క్రితం మా సదాశివ సారు నోటివెంట విన్నాను.

అప్పటికే పెన్నాగారు గజల్ కవిగా సుప్రసిద్ధులు. అప్పట్లోనే పెన్నా గారి కవిత్వం పత్రికల్లోవచ్చేది.


గజల్ ఉర్దూలో ప్రాచుర్యం పొందిన ఒక ప్రక్రియ.అందుకే ఉర్దూ కవిత్వపు లోతులుతెలుసుకోవడానికి సదాశివ గారిని సంప్రదించే వారనుకుంటా.

అప్పటికి పేరుమాత్రమే తెలిసిన నేను ఆయన కూడా సదాశివ గారిలాగే పెద్దవయసు వారనుకు న్నాను.కాని ఇటీవల తెలిసింది వారికి మొన్నమొన్ననే షష్టి పూర్తిఅయ్యిందని.పెన్నాగారి వృత్తి, ప్రవృత్తికి అనుకూలమైంది కనుక ఇటు తెలుగు అధ్యాపకుడిగా ఉంటూ ఎం.ఏ.,ఎం.ఫిల్.,-పి హెచ్.డి పూర్తి చేసుకున్నారు. అలాగే అటు కవిగా ,విమర్శకునిగా పరిణత దశకు చేరుకున్నారు. పెన్నా గారిది నిశ్శబ్ద విప్లవం. రాశి కన్నా వాసికి అత్యంత ప్రాముఖ్యతనిచ్చే ఆయన అనేకకవిత్వరూపగుహాంతర్భాగాలలోకి దూరి వాటి ఆనుపానులను పట్టుకున్నారు. ముఖ్యంగా గజల్, రుబాయీ వంటి ఉరుదూ ఫారసీ ప్రక్రియల స్వరూప స్వభావాల గురించితెలుసుకోవడానికి డా. సామల సదాశివ, డా.నోముల సత్యనారాయణ వంటి వరిష్ఠులద్వారాఆ ప్రక్రియలపై సాధికారాన్ని సంపాదించిన వారు పెన్నా శివరామకృష్ణశర్మ గారు.


స్వతహాగా మంచి కవి, ఆపై విశిష్ట విమర్శకులు కావడంతో ఏది రాసినా లోతుగాఆలోచించి ప్రక్రియ ప్రామాణికతను నిలబెట్టే కవిత్వాన్ని వెలువరించగల ఒడుపు ఉన్నకవి పెన్నా. ప్రాచ్య పాశ్చాత్య కవిత్వపోకడల తీరు తెలిసిన వారు. పలు వాదాల ధోరణి ఎరిగినవారు. వారిది ఒక వచన కవిత చూడండి.

## అప్రమేయంగానే..............!!

కొన్ని అప్రమేయంగానే వచ్చి చేరతాయి.
దుస్తులకంటుకున్న ఇసుక రేణువులా..
గాలాల దుస్తులు ధరించిన పల్లేరులా...
బాటసారి జేబులో రాలిన పూరెమ్మలా...
తేమ ఆరిపోగానే
వచ్చినంత నిశ్శబ్దంగానే రాలిపోతాయి ఇసుక రేణువులు,
వేళ్ళ చివర కొన్ని చిట్టి గులాబీలను వికసింపజేసి,
జీవనవస్త్రానికి కొన్ని శిథిల గవాక్షాలను అమర్చి
పల్లెరుకాయలూ నిష్క్రమిస్తాయి.
మనిషిని కస్తూరి మృగంగా మార్చే జేబులోని పూరెమ్మను
వాడిపోకుండా కాపాడనూ లేము, పారేయనూలేము!



ప్రపంచవస్త్రానికి అంటుకున్న ఇసుక రేణువులం,
స్పృశించిన దానినల్లా అంటుకు తిరిగే పల్లేరుకాయలం,
అనూహ్య సుగంధ బుద్బుదాలం మనమేనని....
చివరకు రాలేటప్పుడు కానీ తెలియదేమో !!
కొన్ని అప్రమేయంగానే వచ్చి చేరతాయి !
వచ్చినంత నిశ్శబ్దంగానే రాలిపోతాయి !!



కవితలో ఇసుక రేణువులతో, పల్లేరు కాయలతో,రాలిన పూరెమ్మలతో మనిషి మనుగడనుపోల్చడం ఎంతో భావ-గర్భితంగా ఉంది.మనిషి లక్ష. ణాలకు తగిన ప్రతీకలుఎంచుకోవడంలోనే తెలుస్తుంది కవి ప్రతిభ. ఏ ప్రమేయం లేకుండానే ప్రపంచంలో మనిషి రావడంపోవడం ఎలాగో చెప్పడమే కవితలోని మర్మం. ఆయన వచన కవిత్వానికి-ది ఒక మచ్చుతునక మాత్రమే. ఇక ఈ రుబాయీ చూడండి.

'వదలిన కొమ్మకు పక్షే పెను భారం అవుతుంది
ఊహ గాలిపటమైతే మది దారం అవుతుంది
ఛందస్సులు భావాలకు పెను సంకెలలవుతాయా
మలచుకుంటె ప్రతిబంధం సుమహారం అవుతుంది'

'అశ్రుధార'అనే రుబాయీ సంపుటిలోనిది ఇది.ఇలాంటి అందమైన, భావస్ఫోరకమైనఐదువందల రుబాయీల సంపుటి. వీరు ఇటీవల వెలువరించిన అశ్రుధార.ఇందులోని ఏ రుబాయీ కా రుబాయీనైపుణ్యంతో రూపొందించిన సౌష్టవం కలిగిన అందమైన స్వర్ణాభరణలా ఉంటుంది. తెలంగాణ రుబాయీలు పేరుతో ఇదివరకే ఒక పుస్తకం ప్రచురించారు వీరు.
అలాగే జపాన్ లో ఆవిర్భవించి ప్రపంచవ్యాప్తమైన లఘు కవితా ప్రక్రియ హైకూ గురించికూడా చాలా శ్రమించి ప్రపంచ ప్రసిద్ధమైన కొన్ని హైకూలను తెలుగు పాఠకులకు అందించారు. (ఇంకా వుంది)



ASIAN WORLD RECORDS ™

# Asian World Records

## Certificate

The Asian Record of "**First Ever Video Magazine**" has been achieved by **CHAITANYAM SANKALPABALAM**, established on 11th November, 2011 in Hyderabad, Telangana, India. The Unique Video Magazine (first of its kind) has the contributions of 33 Writers as was confirmed on 12th April, 2021.

The achievement and record claim have been placed in Asian World Records.

**Date of Issue: 12th April, 2021**

APPROVED

Santhi

**Dr. Santhi Devi**

**Founder & Chief Editor**

Official Registrar ASIAN WORLD RECORDS

This Certificate must not be reproduced without prior permision of Asian World Records.

www.asiantalentpromotionforum.com asiantalentpromotionforum@gmail.com

# Asian World Records

## Certificate

The Asian Record of " First Woman Owner, Publisher & Editor of a Magazine " has been achieved by **SHANTI TEEGAVARAPU**, born on 15th January, 1955 in Hyderabad, Telangana, India.

She is the first Woman Owner, Publisher & Editor of a magazine with matchless contribution running for the last 10 years uninterrupted as was confirmed on 12th April, 2021.

The achievement and record claim have been placed in Asian World Records.

**Date of Issue: 12th April, 2021**

APPROVED

Santhi

**Dr. Santhi Devi**

**Founder & Chief Editor**

MALAYSIA

Official Registrar
ASIAN WORLD RECORDS

**This Certificate must not be reproduced without prior permision of Asian World Records.**

www.asiantalentpromotionforum.com asiantalentpromotionforum@gmail.com

# ఉగాది

భారతీ శర్మ



చైతన్యం పాఠకులకు, ప్రేక్షకులకు ప్లవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు. ఈ ఉగాది అందరికీ ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని, విజయాలను సమకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. ముక్కలు, యూ రస,కొత్త

ఉగాది మన తెలుగువాళ్ళ నూతన సంవత్సరము. ఈ ఉగాది ఒఅందుగ తెలుగు లోగిళ్ళలో ఉగాది పచ్చడితో ప్రారంభం అవుతుంది. ఈ ఉగాదితి ఎన్నో అనుభూతులు, జ్ఞాపకాలు ఉన్నాయి నాకు. మా చిన్నప్పుడు మా అమ్మమ్మగారు ఈ ఉగాది పచ్చడిని కొత్త మట్టి కుండలో చేసేవారు. ఈ ఉగాది పచ్చడి షడ్రుచుల సమ్మేళనం. దీనిని ఎలా తయారుచేస్తారు అంటే మామిడిముక్కలు, చెరుకు ముక్కలు, అరటిపండు ముక్కలు, వేపపువ్వు, కొత్త చింతపండు రసం, ఉప్పు, పసుపు, కారం.

ఈ సీజన్ లో కొత్త చింతపండు, కొత్త బెల్లం వస్తాయి కాబట్టి చింతపండు రసంలో బెల్లం ముక్కలు కలిపి మిగతా పదార్థాలన్నీ కలిపి చేదు,వగరు,పులుపు, ఉప్పు, కారం మరియు తీపి - ఈ ఆరు రుచులతో ఈ పచ్చడిని తయారుచేస్తారు. జీవితంలో మనకు ఎదురయ్యే రకరకాల అనుభవాల ద్వారా మనం చక్కని వ్యక్తిత్వం గల మనుషులుగా తీర్చిదిద్దపడతామని ఈ పచ్చడి ద్వారా మనకు తెలియజేసారేమో!

మా అమ్మమ్మ చేసే ఉగాది పచ్చడి చుట్టుప్రక్కల వారంతా వచ్చి అడిగి తీసుకుని వెళ్లేవారు.

ఉగాది రోజు నైవేద్యాలు పెట్టే సాంప్రదాయం కూడా మనకు వుంది. ఎన్ని పిండివంటలు చేసినా మా మామయ్యలు ముందుగా వేడివేడి అన్నంలో ఈ ఉగాది పచ్చడిని వేసుకుని తినేవారు. అవన్నీ తియ్యని జ్ఞాపకాలు నాకు. ఈ ఉగాదితో మీకూ ఇలాంటి ఎన్నో అనుభూతులు, జ్ఞాపకాలు ఉండే ఉంటాయి కదూ!

మరోసారి అందరికీ నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు.

నమస్తే,

భారతీ లక్ష్మి (సైనిక్ పూరి)

# ఉగాది పాట

డా. స్రవంతి



ఉగాదిని ఆహ్వానిస్తూ డా. స్రవంతి గారు పాడిన పాట విందామా? వీక్షిద్దామా?

# ఏప్రిల్ నెలనుంచి అమలులోకి రాబోతున్న 12 కొత్త నిబంధనలు



వి. నిర్మల

1. మీ పాన్ కార్డ్, ఆధార్ నెంబరు లింక్ చేశారా? లింక్ చేయకపోతే, ఏప్రిల్ నుంచి ఫైన్ చెల్లించాల్సి వస్తుంది. పాన్, ఆధార్ లింక్ చేయడానికి ఆఖరు తేదీ 31-3-2021. కానీ ఈ గడువును 30-6-2021 వరకు పొడిగించడమైనది.

2. ఇటీవల ఎనిమిది ప్రభుత్వ రంగ బ్యాంకుల్ని విలీనం చేసి మూడు బ్యాంకులుగా మార్చారు. దీంతో ఏప్రిల్ 1 నుంచి పాత బ్యాంకులకు చెందిన పాస్ బుక్స్, చెక్ బుక్స్ పనిచేయవు. ఈ నిబంధనను కూడా ప్రభుత్వం కొంచెం సడలించి పాత చెక్ బుక్కులను 30-6-2021 వరకు ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించారు.

3. ఇన్ కమ్ టాక్స్ కొత్త స్లాబ్ ప్రకారం పన్నులు చెల్లించాలి.

4. ఇకపై ఇన్ కమ్ టాక్స్ రిటర్న్స్ కోసం ప్రి -ఫిల్డ్ ఫామ్స్ రానున్నాయి. దీనివలన పన్ను చెల్లింపుదారులు సులువుగా రిటర్న్స్ ఫైల్ చేయవచ్చు.

5. మార్చి 31 న ఎల్. టి. సి. స్కీమ్ లో ఇచ్చిన మినహాయింపులు ముగుస్తాయి, ఏప్రిల్ 1 నుంచి ఎలాంటి మినహాయింపులూ ఉండవు.

6. ఇన్ కమ్ టాక్స్ రిటర్న్స్ ఫైల్ చేయనివారినుంచి టి. డి. ఎస్. పై ఎక్కువ రేటు వసూలు చేయనున్నారు.

7. ఏప్రిల్ 1 తర్వాత 75 ఏళ్ల పైన ఉన్నవారు ఆదాయపు పన్ను (ఇన్ కమ్ టాక్స్) రిటర్న్స్ ఫైల్ చేయాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం వారి పన్నులను బ్యాంకులనే డిడక్ట్ చేయమంటున్నది.

8. కొత్త వేతన-కోడ్ ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రాబోతున్నది. మొత్తంగా ఉద్యోగుల టేక్ - హోమ్ సాలరీ తగ్గుతుంది.

9. ఒక కంపెనీలో ఐదేళ్లు వరుసగా సేవలు అందించాక ఉద్యోగులకు గ్రాట్యుటీ లభిస్తుంది.

10. ఏప్రిల్ 1 నుంచి టర్మ్ ఇన్సూరెన్స్ రేట్లు పెరగనున్నాయి.

11. టూరిజం ను ప్రమోట్ చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ ను అందిస్తోంది.

12. ఏప్రిల్ 1 నుంచి టి. వి., రిఫ్రిజిరేటర్, ఏ.సి. ధరలు పెరగనున్నాయి. విడిభాగాల కొరతతో పాటు, ప్రభుత్వం కస్టమ్స్ ద్యూటీ పెంచడం లాంటి కారణాలతో వీటి ధరలు పెరగనున్నాయి.



# సినిమా

నండూరి సరోజాదేవి



సినిమా అనే కాన్సెప్ట్ పై 'నా అభిప్రాయాలను,ఆలోచనలను క్రమం తప్పక ప్రతి నెల ఎపిసోడ్స్ రూపకంగా "చైతన్యం మాస పత్రికలో " రాస్తూ వస్తున్న కారణంగా..కొన్ని సినీ గీతాల సంగతులను కూడా అందు జోడిస్తే బావుంటుంది అనిపించి,ఆ ప్రయత్నం చేస్తున్నాను.

*సినిమా పాటలు, సంగీతం మహత్తర శక్తిని కూడా కలిగి వుంటాయని 'అది ఒక నానుడిగా' అందరూ అనుకుంటూ వుంటారని తెలిసున్నదే. "యేడ్చే చిన్న పిల్లలకి జోల పాటలు అయినా, ఇతర పాటలు అయినా పాడి వినిపిస్తే చాలు హాయిగా నిద్రపోతారనీ,అనారోగ్యంతో మంచం పట్టిన వారు సహితం సంగీతాన్ని వింటే లేచి కూర్చుంటారని,బండరాళ్లను కూడా కరిగించ గలుగుతాయనీ" సర్వత్రా విదితమైన విషయమే.

అంతే కాదు! ఈ కాలపు యువత హుషారు అయిన పాటలకీ, మంచి బీట్ అందించే సంగీతానికి ఎక్కువ మక్కువ చూపించినా..చాలామంది పెద్ద వాళ్ళు మాత్రం,పాత సినిమాల లోని"భావయుక్తమైనా, సంగీత నృత్య ప్రాధాన్యమైనా, భక్తి రసమైన, సాహిత్యపరమైన,మహిళా ప్రాధాన్యమైనా" వినసొంపైన పాటల పట్ల కూడా ఇప్పటికీ అభిమానం చూపిస్తూనే ఉంటారు.

అలాగే! ఘంటసాల, A.M రాజా, P.లీల,జమునా రాణీ,P.సుశీల,S.జానకీ, S.P.బాలసుబ్రహ్మణ్యం వంటి ఎందరెందరో గొప్ప గొప్ప గాయనీ, గాయకులు దశాబ్దాలకాలంగా ఎన్నెన్నో శ్రావ్యమైన పాటలు పాడి, ఇలా అభిమానులందరినీ ఎంతగానో మెప్పించగలిగారు అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

ఇలా పాత సినిమా పాటలు,ఆ సంగీతాన్ని గురించి అంటుంటే నాకు ఒకటి గుర్తుకొస్తోంది! పూర్వకాలం ఇళ్లల్లో అందరూ రేడియోల్లో సినీ గీతాలు వస్తుంటే, మానకుండా రోజూ వింటూండడం.. అలాగే, కొత్త సినిమాలు వస్తున్నాయి అనే వినికిడి అయితే చాలు దాని కథ పైన, అందులోని పాటలపైనా తెలుసుకోవడానికి ఎక్కువ ఆసక్తి కనపర్చడం కూడా చేసేవాళ్ళు. ఇక,పండుగలు వాటి సందర్భాన..ఇంట్లోని పెద్దవాళ్ళ అంగీకారం అయితే, ఊళ్ళో "నాటకాలు,హరికథలు,బుర్రకథలు వంటివి" పెద్ద ఎత్తున జరిగే చోటుకి, సరదాకి కాసేపు వెళ్ళి చూసిరావడం అన్నది చాలా మందికి ఒక కాలక్షేపము, ఎంటర్టైన్మెంట్ గా వుంటూ ఉండేవి.

"పాత సినిమాలపై" పూర్వకాలంలో జనాలకి వుండే 'ఎంజాయిమెంట్ పరిస్థితులు, ఆ విశేషాలను' గురించి కొన్ని సంగతులను కూడా రాసి, మీ ముందు ఉంచాలనుకుంటున్నాను!

ఎందుకంటే! అవి చదివే చాల మంది "అవును,అప్పుడు అలా జరిగేది కదా, మనం అలాగే చేసేవాళ్ళం కదా?" అనే ఎన్నెన్నో జ్ఞాపకాలను,ఒకసారి ఆత్మావలోకనం చేసుకోవచ్చేమో అనే భావన కూడా నాకు కలుగుతోంది.

oooooooooooooooooo

** పాఠకులకు,అనుకోకుండా"ఒక మనవి" చేయాల్సివస్తోంది:- ఇందాక,మీకు పైన చెప్పినట్టు..

సినిమాలపై జనాలకి వుండే 'ఆ ఇంట్రస్టు,సరదా సంగతులను' రాసే ముందు.."ఇంపార్టెంట్ విషయం ఒకటి" మీకు తెలియ చేయాల్సివస్తుంది!

(సశేషం)

తకు-
ందు
ిన
తై-
ుకో-
ను-





RNI No. TELTEL/2011/39497 APRIL 2021 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication: 1st April Date of Posting: 8th April



Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.